# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :87 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 26-05-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఈనెల 27న ప్రత్యేక సెలవు..

హైదరాబాద్,ఈ నెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గంలో ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక క్యాజువల్ సెలవు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, సిద్ధిపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సీఎల్ ఇవ్వాలని స్పష్టం చేశారు.ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రైవేట్ ఉద్యోగులకు సెలవు ఇవ్వాలని చట్టంలో లేదని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సీఈవో సూచించారు. ప్రైవేట్ కంపెనీలు, వ్యాపార సంస్థలు తమ సిబ్బంది ఓటు వేసేందుకు వీలుగా షిఫ్టుల సర్దుబాటు లేదా ఆలస్యంగా వచ్చేందుకుగానీ, మధ్యలో వెళ్లి ఓటు వేసి వచ్చేందుకుగానీ అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ కోరారు. ఈ మేరకు అన్నిసంస్థలు, కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆ 32 వేల ఉద్యోగాలు రేవంత్ ఇయ్యలే.. కేసీఆరే ఇచ్చిండు



హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక 32 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పుకుంటున్న రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఆ 32 వేల ఉద్యోగాల భర్తకి సంబంధించిన వివరాల'ను కేటీఆర్ బ'ట్ట'బయ'లు చేశారు. ఈ ఉద్యోగాలకు రేవంత్ కేవలం నియామక పత్రాలు మాత్రమే అందజేసినట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. 32,517 ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆరేన ని కేటీఆర్ తేల్చిచెప్పారు.తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తాము అధికారంలోకి 30 వేల ఉద్యోగాలు ఇచ్చాన ని రేవంత్ రెడ్డి, మంత్రులు ఊదరగొడుతున్నారు. మీరు 30 వేల ఉద్యోగాలు ఇచ్చిన మాట వాస్తవం అయితే ఏ రోజు నోటిఫికేసన్ ఇచ్చారు. రాతపరీక్ష ఎప్పుడు నిర్వహించారు. ఫలితాలు ఎప్పుడు ఇచ్చారో తెలంగాణ నిరుద్యోగులకు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను. కానీ వారు చెప్పారు. ఉద్యోగాల భర్తీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇష్టమొచ్చినట్టు అబద్దాలు చెబుతున్నారు. 32 వేల ఉద్యోగాల భర్తకి సంబంధించిన వివరాలను వెల్లడిస్తున్నట్లు కేటీఆర్ ప్రముఖులు.గురుకులాల్లో 9,210 టీజీటీ, పీజీ పోస్టుల భర్తికి ఏప్రిల్ 2023లో నోటిఫికేషన్ ఇచ్చారు. ఆగస్ట్ 2023లో రాతపరీక్షలు నిర్వహింపబడ్డాయి. ఫలితాలు మాత్రం ఫిబ్రవరి 2024లో విడుదలయ్యాయి. ఈ పోస్టుల భర్తీని కూడా తన ఖాతాలో వేసుకోవడం రేవంత్ రెడ్డి రాజకీయ దివాలాకోరు తనానికి నిదర్శనం అని చెప్పొచ్చు.పోలీసు శాఖలో 17,516 ఉద్యోగాలకు ఏప్రిల్ 2022లో నోటిఫికేషన్ ఇచ్చాం. జూన్ 2023లో రాతపరీక్షలు నిర్వహించాం. అక్టోబరు 4, 2023లో ఫలితాలు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావటంతో భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. పోలీసు ఉద్యోగాల భర్తీ కేసీఆర్ హయాంలోనే జరిగింది. రేవంత్ రెడ్డి నియామ క పత్రాలు ఇచ్చి బుకాయించే ప్రయత్నం చేస్తున్నారు.5,204 స్టాఫ్ నర్సు ఉద్యోగాల భర్తికి డిసెంబరు 2022లో నోటిఫికేషన్ జారీ చేసి, ఆగస్ట్ 2, 2023న రాతపరీక్ష నిర్వహించాం. డిసెంబరు 23, 2023న ఫలితాలు ప్రక టించాం. ఇవి కూడా తానే ఇచ్చిన రేవంత్ రెడ్డి అంటున్నారు.587 ఎస్ఐ, ఏఎస్ఐ పోస్టులకు ఏప్రిల్ 2022లో నోటిఫికేషన్ జారీ అయింది. ఏప్రిల్ 2023లో రాతపరీక్ష నిర్వహించి, ఆగస్ట్ 7 2023లో ఫలితాలు ప్రకటించాం. కానీ న్యాయ పరమైన చిక్కుల వల్ల నియామక పత్రాలు ఇవ్వలేకపోయాం. పైన ఉద్యోగాలకు రేవంత్ కేవలం నియామక పత్రాలు మాత్రమే ఇచ్చారు. 32 వేల ఉద్యోగాలు భర్తి చేసింది మాత్రం కేసీఆర్ అని కేటీఆర్ స్పష్టం చేశారు. నిన్న రేండ్ల కాలంలో 1.60 లక్షల ఉద్యోగాలు పూర్తి స్థాయిలో భర్తీ చేయగా, 32 వేల ఉద్యోగాలు కొన్ని కారణాల వల్ల ఆగిపోయాయి. ఇవి మొత్తం కలుపుకుంటే కేసీఆర్ భర్తీ చేసిన ఉద్యోగాలు ఒక లక్ష 92 వేల పైచిలుకు ఉద్యోగాలు అని కేటీఆర్ తెలిపారు.

## వారికి నన్నుతిట్టడమే పని.. ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు దేశం కోసం నిరంతరం పని చేసే మోదీకి, పని లేని ఇండియా కూటమికి మధ్య జరుగుతున్నాయని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. ఇవాళ బిహార్‌లోని పాటలీపుత్రలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మోడీ మాట్లాడారు. భారత్‌ను అన్ని రంగాల్లో బలోపేతం చేయడమే తమ లక్ష్యమని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు.ఇండియా కూటమి రాత్రి పగలు మోదీని దుర్భాషలాడడంలో బిజీగా ఉందని ఆరోపించారు. '2024 ఎన్నికల్లో ఒకవైపు 24 గంటలు కష్టపడుతున్న మోడీ, మరోవైపు అబద్ధాలు చెప్పే ఇండియా కూటమి ఉంది. 2047 నాటికి భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చడంలో మోదీబిజీగా ఉన్నారు. కానీ మోడీని దుర్భాషలాడంలో ఇండియా కూటమి నేతలు బిజీగా ఉన్నారు' అని వ్యాఖ్యానించారు.రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) పైనా మోదీ విమర్శలు గుప్పించారు. ఎల్ఈడీ బల్బుల కాలంలో బిహార్‌లో లాంతరు కూడా ఉండేదని తెలిపారు. లాంతర్ ఒక ఇంటిని మాత్రమే వెలిగిస్తుందని, కానీ బిహార్ మొత్తం ప్రస్తుతం చీకట్లోనే ఉందని ఆరోపించారు. లాంతరు వల్లే ఈ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రపంచం ముందు తన అభిప్రాయాలను బలంగా అందించగల ప్రధాని భారతదేశానికి అవసరమని నొక్కి చెప్పారు. ఇండియా కూటమి 24 గంటలు అబద్దాలు ప్రచారం చేస్తోందన్నారు. వారు అధికారంలోకి వస్తే ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులను చూడాల్సి వస్తుందని ఆరోపించారు.

### ప్రతి ఓటు విలువైనది: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఇవాళ ఆరో విడుత పోలింగ్ జరుగుతోంది. ఈ



నేపథ్యంలో ప్రధాని మోదీ(పీఎం మోదీ) సందేశం ఇచ్చారు. ప్రతి ఓటు విలువైనదని, మీ ఓటును కూడా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. భారీ సంఖ్యలో ప్రజాలు ఓటింగ్‌లో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు.ఎన్నికల సరళిలో ప్రజలు చైతన్యవంతంగా పాల్గొంటేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని అన్నారు.ఎక్స్ అకౌంట్‌లో ఆయన మెసేజ్ చేశారు.ఆరో దశ ఎన్నికల్లో ఓటు వేస్తున్నవారు భారీ సంఖ్యలో పోలింగ్ స్టేషన్లకు తరలిరావాలన్నారు. ప్రతి ఓటు లెక్కలోకి వస్తుందని, మీ ఓటు కూడా విలువైందన్నారు. మహిళా ఓటర్లు, యువత భారీ సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొవాలని ఆయన నిశ్చయించుకున్నారు. ఆరు రాష్ట్రాలు,రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను 58 నియోజకవర్గాల్లో ఇవాళ పోలింగ్ జరుగుతోంది.ఢిల్లీలోని ఏడు సీట్లకు కూడా ఓటింగ్ జరుగుతోంది.

## అల్లర్లు,హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు



శ్రీకాకుళం, అల్లర్లు,హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ రాధిక తెలిపారు. శనివారం శ్రీకాకుళం పట్టణంలో జిల్లా ఎస్పీ రాధిక పర్యవేక్షణలో జిల్లా ఆర్మ్డ్ రిజర్వు పోలీసులు డే అండ్ నైట్ కూడలి వద్ద మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారు.సార్వత్రిక ఎన్నికల అనంతరం తుది ఫలితాలు వచ్చేవరకు జిల్లాలో ఎటువంటి అల్లర్లు, హింసాత్మక ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా జిల్లా పోలీస్ యంత్రాంగం శ్రీకాకుళం పట్టణంలో డే అండ్ నైట్ కూడలి వద్ద మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు . ఈ మాబ్ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశం పోలీసుల సన్నద్ధత, ప్రజల్లో అవగాహన,చైతన్యం చేసేందుకు. జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉన్నందున అసాంఘిక కార్యకలాపాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తుల మూకలను నియంత్రించి, ఒకే చోట నలుగురు కన్న ఎక్కువ మంది గుమ్మి గుడి ఆందోళనలు, హింసాత్మక ఘటనలు,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై లాఠీచార్జ్, ఫైరింగ్ చేయడానికి వెనకాడబోమని ఎస్పీ హెచ్చరించారు. ఓట్లు కౌంటింగ్ తుది ఫలితాలు అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహణకు అనుమతులు లేవని, జిల్లాలో శాంతియుతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేందుకు ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు జిల్లా పోలీసులు యంత్రంగానికి సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ కోరారు.

### ఆకట్టుకున్న మాక్‌డ్రిల్

ముందుగా ఓ వైపు ప్లకార్డులు చేతపట్టిన ఆందోళనకారులు, అల్లరి మూకలు(పోలీసులు) మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు ఆందోళనకారులను (వేషాల్లో ఉన్న పోలీసులు) మొదటగా హెచ్చరిక ఇచ్చుట, అది వినకపోతే పై అధికారుల అనుమతితో భాష్ప వాయువు ప్రయోగించుట ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించుట,లాఠీ చార్జ్ చేపట్టుట,ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయుట. అప్పటికి పరిస్థితి అదుపులోకి రాక పోతే ఆందోళనకారులు చెదరగొట్టేందుకు ఫైరింగ్ చేయుట వంటివి మాబ్ అత్యంత నైపుణ్యంతో ప్రదర్శించారు.

## అవతరణ వేడుకలకు ఏర్పాట్లు..దశాబ్ది ఉత్సవాలకు ఆదేశాలు

నిర్మల్,మే25: రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దశాబ్ది ఉత్సవాల కారణంగా ఈ సంవత్సరం అంగరంగ వైభవంగా వేడుకలను జరుపుకోవడం జరుగుతుందని, అందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జూన్ 2వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలపై ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రప్రభుత్వం మార్గదర్శకాలు, ఆదేశాలకు అనుగుణంగా జూన్ 2న జిల్లా, డివిజన్, మండలం, పంచాయతీలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. కార్యాలయంలో విద్యుత్ దీపాలతో అలంకరించాలని, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయాలని అన్నారు. వేడుకల సందర్భంగా అంత రాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన ఆవార్డుల లిస్టునుసమర్పించాలని తెలిపారు.

## ఓటేసిన రాష్ట్రపతి,ఉపరాష్ట్రపతి సహా పలువురు ప్రముఖులు







న్యూఢిల్లీ,మే25: లోక్‌సభ ఎన్నికలకు ఆరో విడత పోలింగ్ శనివారం ప్రారంభమైంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావడంతో ఓటర్లు మెల్లగా క్యూలకు చేరారు. దీంతో ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తుతున్నారు. దేశంలోని 6 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ నియోజకవర్గాల్లో శనివారం పోలింగ్ చేపట్టారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్ర 5 గంటల వరకు కొనసాగనుంది. కొన్ని సమస్యాత్మక ప్రాంతాల్లో మాత్రం సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగియనుంది. ఉదయం పోలింగ్ ప్రారంభానికి ముందే ఓటర్లు పోలింగ్ కేంద్రాల దగ్గర బారులు తీరారు. సామాన్య ప్రజలతో పాటు పలువురు ప్రముఖులు సైతం ఓటు హక్కు వినియోగించు కున్నారు. తొలి గంటల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సహా పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించు కున్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నెరవేర్చాలని ఆమె పిలుపునిచ్చారు.దేశ రాజధాని ఢిల్లీలోని ఓ పోలింగ్ కేంద్రంలో దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ఆయన భార్య సుదేశ్ క్యూలైన్‌లో నిల్చుని ఓటు వేశారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఓటు హక్కు వినియోగించు కున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన తొలి పురుషుడు ఈయనే కావడంతో అధికారులు సర్టిఫికేట్ ఇచ్చారు. ఆ విషయాన్ని ఆయన ఎక్స్‌లో పంచుకుంటూ తన సర్టిఫికెట్ చూపించారు. తూర్పు ఢిల్లీ ఎంపీ, మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్, బిజెపి లోక్‌సభ అభ్యర్థి బన్సూరీ స్వరాజ్, ఆమె తండ్రి కౌశల్ స్వరాజ్, కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ దంపతులు, పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ కుటుంబం, ఢిల్లీ మంత్రులు సౌరభ్ భరద్వాజ్, ఆతిశీ, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ, మాజీ సీఈసీ సుశీల్ చంద్ర తదితరులు తొలి గంటల్లో ఓటేశారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్ తన భార్య సుదేశ్ ధన్‌ఖర్‌తో కలిసి ఢిల్లీలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కూడా ఓటువేశారు. ఇక కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు ప్రియాంక గాంధీ, ప్రియాంక పిల్లలు రైహాన్ రాజీవ్ వాద్రా, మిరయా వాద్రా, ఢిల్లీ మంత్రులు అతిశీ, సౌరభ్ భరద్వాజ్, ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ ఢిల్లీలో ఓటు వేశారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో తెలంగాణ ఇంచార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. గవర్నర్ రాధాకృష్ణన్ క్యూలైన్‌లో వచ్చి ఓటు వేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇవాళ తాను ఓటు వేసి ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకున్నాను. ప్రతి పౌరుడు కూడా విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఓటు వేయడం ఒక హక్కు మాత్రమే కాదు, దేశానికి ప్రజాస్వామ్య కర్తవ్యం కూడా అని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. జార్ఖండ్‌లోని 4 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ పక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. ఆరో విడతలో 6 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలోని 58 నియోజకవర్గాల్లో పోలింగ్ కొనసాగుతోంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఆరో విడతలో ఉదయం 9 గం. వరకు 10.82 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.ఇప్పటికే ఐదు విడతల పోలింగ్ ముగిసిపోగా ఇప్పుడు ఆరో విడత పోలింగ్ జరుగుతోంది. జూన్ 1న జరిగే చివరి విడతతో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ పక్రియ ముగియనుంది. జూన్ 4న ఒకేసారి ఓట్లను లెక్కించి ఫలితాలు విడుదల చేయనున్నారు. ఆరో విడత పోలింగ్ జరగనున్న రాష్ట్రాలజాబితాలో బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాలు ఉన్నాయి. బీహార్‌లో 8, హరియాణాలో 10, జమ్మూకశ్మీర్లో 1, జార్ఖండ్‌లో 4, ఢిల్లీలో 7, ఒడిశాలో 6, యూపీలో 14, బెంగాల్లో 8 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. జమ్మూకశ్మీర్లోని అనంతనాగ్‌లో మూడో విడతలోనే పోలింగ్ జరగాల్సి ఉండగా వాయిదా పడింది. ఆరో విడతలో ఆ లోక్‌సభ స్థానానికి పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆరో విడతలో వివిధ పార్టీల నుంచి కీలక అభ్యర్థులు బరిలో దిగుతున్నారు. ఢిల్లీలో 7 లోక్‌సభ స్థానాలకు ఆరో విడత ఎన్నికల్లోనే పోలింగ్ జరగనుంది. లిక్కర్ స్కామ్ కేసు, స్వాతి మాలివాల్‌పై దాడి లాంటి పరిణామాలు అక్కడి రాజకీయాలను వేడెక్కించాయి. దాంతో ఆరో విడత లోక్‌సభ ఎన్నికలపై ఎప్పుడూ లేనంతగా ఉత్కంఠ నెలకొంది.న్యూఢిల్లీ నుంచి కేంద్ర మాజీ మంత్రి, దివంగత సుష్మా స్వరాజ్ కూతురు బన్సూరి స్వరాజ్ బీజేపీ తరపున బరిలోకి దిగుతున్నారు. ఆమె ఆప్ అభ్యర్థి సోమ్‌నాథ్ భారతితో తలపడనున్నారు. ఈశాన్య ఢిల్లీలో ఈసారి టఫ్ ఫైట్ కనిపించేలా ఉంది. కాంగ్రెస్ తరపున కన్హయ్య కుమార్ బరిలోకి దిగగా, బీజేపీ తరపున సిట్టింగ్ ఎంపీ మనోజ్ తివారీ పోటీ చేస్తున్నారు. యూపీలోని సుల్తాన్‌పూర్‌లో బీజేపీ తరపున మేనకాగాంధీ బరిలోకి దిగారు. సమాజ్‌వాది పార్టీ నుంచి రామ్ బువల్ నిషద్ బరిలో ఉన్నారు. ఇక యూపీలోనే మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ సోదరుడు ధర్మేంద్ర యాదవ్ ఆజాంగఢ్ నుంచి బరిలోకి దిగారు. 2014, 2019 ఎన్నికల్లో ఇక్కడి నుంచే బరిలోకి దిగిన అఖిలేష్ యాదవ్ విజయం సాధించారు. ఈ సారి కూడా తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడన్న నమ్మకంతో ఉన్నారు. ఒడిశాలోని పూరి నియోజకవర్గంలో బీజేపీ తరపున సంబిత్ పాత్ర పోటీ చేస్తున్నారు. ఇక్కడ బీజేడీ తరపున అరుప్ పట్నాయక్, కాంగ్రెస్ నుంచి జయ్ నారాయణ్ పట్నాయక్ బరిలో ఉన్నారు. హర్యానాలోని కురుక్షేత్రలో బీజేపీ తరపున నవీన్ జిందాల్ బరిలో ఉన్నారు. కర్నాల్ నియోజకవర్గం నుంచి హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పోటీ చేస్తున్నారు. గుడ్గావ్‌లో కాంగ్రెస్ తరపున రాజ్ బబ్బర్.. బీజేపీ సిట్టింగ్ ఎంపీ ఇంద్రజిత్ సింగ్‌తో తలపడుతున్నారు. ఒడిశాలోని 42 అసెంబ్లీ స్థానాలకు కూడా లోక్‌సభ ఆరో విడత ఎన్నికలతోపాటే పోలింగ్ జరుగుతోంది.

## దొంగల ముఠా అరెస్ట్... రూ.11.72 లక్షల సొత్తు రికవరీ



మంచిర్యాల,రామగుండం కమీషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠా (7గురు నేరస్తులు)ను అరెస్ట్ చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. శనివారం నేరస్తులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పాగిడి కార్తీక్, తాటికొండ స్వామి చరణ్, పుప్పాల రాహుల్, గన్నవరం మధూకర్, కుర్సింగ ఈశ్వర్, మడావి రాము, వెడ్మ ప్రవీణ్ అనే నేరస్తులు గత కొంత కాలంగా తాళం వేసి ఉన్న ఇండ్లను గమనిస్తూ రాత్రి వేళల్లో ఇనుప రాడ్లతో తాళాలను పగలగొట్టి ఇండ్లలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు, ఇతరత్రా సామాగ్రిని దొంగిలిస్తూ వాటిని విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అలా దొంగతనం చేసిన సొత్తును కరీంనగర్ కు వెళ్లి అమ్మేందుకు నిర్ణయించుకొని అదే ముఠాలోని నేరస్తుడైన మంచిర్యాల పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన స్వామిశరణ్ అలియాస్ మున్నా ఇంట్లో ఉన్నట్లు సమాచారం రాగా తమ సిబ్బంది అక్కడికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా వారు చేసిన దొంగతనాలను ఒప్పుకున్నారన్నారు.వీరి వద్ద నుండి రూ.9.22 లక్షల విలువ గల బంగారు ఆభరణాలు, రూ.60వేల విలువ గల వెండి ఆభరణాలు, రూ.50వేల విలువ గల బైక్, రూ.1.20 లక్షల విలువ గల టీవి, హోమ్ థియేటర్, రూ.20వేల విలువ గల గిటార్, మొత్తం రూ.11.72 లక్షల విలువ గల సొత్తును రికవరీ చేయడం జరిగిందని చెప్పారు. జనవరి నెల నుంచి మే నెల వరకు జరుగుతున్న వరుస దొంగతనాలపై దృష్టి సారించిన పోలీస్ శాఖ సివిల్, సీసీఎస్ పోలీసులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, నేరస్తులను పట్టుకునేందుకు ఆ బృందం తమదైన శైలిలో కృషి చేసిందని, ఇందులో భాగంగానే ఈ నేరస్తులపై నిఘా పెట్టి అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. నేరస్తులను పట్టుకునేందుకు విధుల్లో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించడంతో పాటు వారికి రివార్డులను అందించారు.

## సీఎంతో సీపీఐ, సీపీఎం,తెలంగాణ జనసమితి నేతల భేటీ



సీఎం రేవంత్‌రెడ్డిని ఇవాళ సీపీఐ, సీపీఎం, తెలంగాణ జనసమితి నేతలు కలిశారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలపై చర్చ నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సీపీఐ, సీపీఎం, తెలంగాణ జనసమితి నేతల భేటీ అయ్యారు.ఈ సమావేశానికి ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు, ఎమ్మెల్యే కూనమానేని సాంబశివరావు, జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్య, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మల్లు రవి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు.

## సంపాదకీయం

ఆదివారం 26-05-2024

# బిఆర్ఎస్ నేతల పెడబొబ్బలు !

దొంగే దొంగాదొంగా అని అరవాలి. ..అల్లరి చేయాలి. గాయ్ చేయాలి. గత్తర లేపాలి. ఇప్పుడు అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ అదే చేస్తోంది. అప్పులు చేశారంటే సమాధానం లేదు. కాళేశ్వరం కుప్ప చేశారంటే మాటల్లేవు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటే ..అది పోలీసులు చేసే పనులంటూ..దాటవేత... ఒక్కటేంటి.. పదేళ్లలో తెలంగాణను చిక్కుముడులు వేసి కోలుకోకుండా దెబ్బవేసిన ఘనత కల్వకుంట వారిది. అయినా ఇంకా పెడబొబ్బలు పెడుతున్నారు. తెలంగాణకు అన్యాయం జరిగిందని అంటున్నారు. ఆరు నెలల్లోనే అస్తవ్యస్తం అయ్యిందని గావు కేకలు పెడుతున్నారు. కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులు ఎక్కడికి వెళ్లినా అంగట్లో పెద్దమ్మలోళ్లు అరిచినట్లుగా చేస్తున్నారు. పాలేందో నీళ్లేందో తేలిపోయిందట... వద్దురా ఈ కాంగ్రెస్ పాలన అని ప్రజలు మొత్తుకుంటున్నారట..కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందట.. వడ్లకు బోనస్ కాదు కదా అసలు వడ్లే కొనడం లేదట.. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారట.. రేవంత్ ప్రభుత్వం రివర్స్ గేర్‌లో వెళ్తోందట...మంచి నీళ్లు రావడం లేదు.. కరెంటు లేదు.. పథకాలు బంద్ అయ్యాయట.. కేసీఆర్ హయాంలో రైతులకు కరెంటుకు ఇబ్బంది లేనేలేదట. కాంగ్రెస్ వచ్చాక మోటర్లు కాలిపోతున్నాయట. వడ్లకు బోనస్ బోగస్.. రైతుభరోసా రాలేదు. మహిళలకు 2500 రాలేదు.. అవ్వాతాతలకు 4 వేల పింఛన్ రాలేదు. రైతులకు 2 లక్షల రుణమాఫీ కాలేదు.. ఒక్క ఉచిత బస్సు తప్ప అన్నీ తుస్ అని అట. నిరుద్యోగులకు 4 వేల భృతి ఇస్తామని ఇవ్వడం లేదట.. ఇలా ఎందుకు జరిగిందన్న ఇంగితం లేకుండా మాట్లాతున్నారు. అడిగేవారు లేరనుకుంటున్నారు. తెలంగాణను అధోగతి పాలు చేసిన బిఆర్ఎస్ ఇప్పుడు ఎదురుదాడి చేయడం దుర్మార్గం తప్ప మరోటి కాదు. నిజంగా ఇవన్నీ ఇవ్వాలంటే రాష్ట్రం గాడిలో ఉందా లేదా చెక్ చేయాలి. కానీ కారులో వచ్చిన కల్వకుంట్ల వారు బంగారు తెలంగాణ... ధనిక తెలంగాణ అంటూ ఊదరగొట్టి కరిమింగిన వెలగపండును చేసి వెళ్లారు. వారి నిర్వాకంపై ప్రపంచ మంతా కోడై కూస్తుంటే ప్రజలకు తెలియకుండా..వారి మదిలో చేరుకుండా గత్తర లేపుతున్నారు. నిజానికి గత ప్రభుత్వాలు చేసిన పాపాలపై ఆనాటి పాలకలును నిలదీసి కక్కించేలా చట్టాలు రావాలి. ఉత్త పుణ్యానికి తెలంగాణను పూర్తిగా డొల్లగా మార్చారు. చెప్పుకుంటూ పోతే అనేక విషయాలు చర్చించవచ్చు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు అందడంలేదంటే కారణం..గత ప్రభుత్వం. ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులు క్లియర్ కావడం లేదంటే గత పాలకులే కారణం. ఇలా చెప్పుఉంటూ పోతే అనేక విధాలుగా అప్పులకుప్ప చేసి అందమైన బొమ్మను చూపారు. ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా చేసే కంపెనీలకు బిల్లుల చెల్లింపు జరగలేదు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకూ చెల్లింపుల్లేవు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేరుకు పోయిన బిల్లులు ఇప్పటికీ క్లియర్ కావడం లేదు. ఖజానాలో సొమ్ములేక ప్రభుత్వం వీటిని పెండింగ్‌లో పెడుతోంది. దీంతో ఆయా వర్గాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. కాలేజీ యాజమాన్యాల నుంచి విద్యార్థులకు సమస్యలు ఎదురవుతుండగా, ఆస్పత్రుల్లో మందులు లభించక, ఆరోగ్యశ్రీ సేవలు సవ్యంగా అందక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీల నిర్వహణ కష్టంగా మారిందని యాజమాన్యాలు వాపోతున్నాయి. కాలేజీలను మూసేసుకునే పరిస్థితి దాపురిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఔషధ కంపెనీలు తమకు బకాయిలు చెల్లించకపోతే ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా చేయలేమంటూ చేతులెత్తేస్తున్నాయి. ఇక ఆరోగ్యశ్రీ బిల్లులు పది నెలలుగా క్లియర్ కావడం లేదని నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం అంటోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడానికి గతంలో కెసిఆర్ ప్రభుత్వ నిర్వాకం తప్ప మరోటి కాదు. వారు చేసిన అప్పులకు వడ్డీలు తడిసి మోపెడు అయ్యాయి. నెలవారీగా సమకూరుతున్న రాబడులు.. నెలవారీ వ్యయాలకే సరిపోతుండడంతో ప్రభుత్వ ఖజానాలో సొమ్ము మిగలడం లేదు. జీతాలు చెల్లించడం గగనంగా మార్చారు. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ల బకాయిలు ఐదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయంటే ఎంత దారుణంగా గత ప్రభుత్వం వ్యవహరించిం దో చర్చించాలి. 2019-20 సంవత్సరం నుంచి ఫీజులను ప్రభుత్వం కాలేజీ యాజమాన్యాలకు చెల్లించక పోవడంతో అవి భారీగా పేరుకుపోయాయి. వీటికి ప్రతి ఏటా కొంత కలుస్తూ ప్రస్తుతం ఈ రెండు పద్దుల కింద రూ.6 వేల కోట్ల దాకా పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో రీయింబర్స్‌మెంట్ బకాయిలే రూ.4 వేల కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. ఫలితంగా ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని బయటికెళ్లబోయే విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మరోవైపు ఇంటర్, డిగ్రీ పూర్తియిన విద్యార్థులు రెండు మూడేళ్ల క్రితమే కోర్సును పూర్తి చేసినా.. ఫీజు రీయింబర్స్ కాలేదు. ప్రధానంగా అప్పుల అసలు, వడ్డీలు చెల్లించాలంటేనే ప్రభుత్వానికి పెద్ద సమస్యగా మారింది. నెలవారీగా సమకూరుతున్న రాబడులు... నెలవారీ వ్యయాలకే సరిపోతున్నాయి. ఇందులో ప్రతి నెలా అన్ని రకాల రాబడుల ద్వారా రూ.12-14 వేల కోట్ల వరకు నిధులు సమకూరుతున్నాయి. నెలకు మరో రూ.4-5 వేల కోట్ల వరకు రుణాలు తీసుకుంటోంది. ఇలా వచ్చే రూ.18-19 వేల కోట్లను ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, అప్పుల కిస్తులు, వడ్డీ చెల్లింపులకు సర్దుతోంది. పర్యవసానంగా సప్లిమెంటరీ బిల్లుల క్లియరెన్స్‌కు ఖజానాలో సొమ్ము మిగలడం లేదు. అప్పుల అసలు, వడ్డీల కింద 2023-24లో ప్రభుత్వం రూ.53,978 కోట్లను చెల్లించాల్సి వచ్చింది. అంటే... నెలకు సగటున రూ.5 వేల కోట్లు అసలు, వడ్డీలకే సరిపోయాయి. ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల కింద రూ.4,500 కోట్లకు పైగా చెల్లించాలి. ఈ వడ్డీలు, వేతనాలే సింహభాగం నిధులను హరిస్తున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని శాఖలను ఊడ్చేశారు. అందినకాడికి కల్వకుంట్ల వారు అప్పులు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ మీద పడి కుటుంబమంతా ఏడ్చేస్తోంది. వీరికి తోడు బిజెపి వారు కూడా శాపనార్థాలు లంఖించుకున్నారు. ప్రభుత్వం రాగానే సర్దుకునే లోపే చేస్తున్న విమర్శలు..కేవలం చేసిన తప్పులను,అప్పులను కప్పి పుచ్చుకునేందుకే అని వేరుగా చెప్పాల్సిన పనిలేదు.

# కుదుపుల నుంచి గుణపాఠాలు



లండన్ నుంచి సింగపూర్ వెళుతున్న సింగపూర్ ఎయిర్ లైన్స్ మిగిల్చిన భీకర కుదుపుల నుంచి ప్రపంచ విమానయాన సంస్థలు అనేక గుణపాఠాలు నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. సంస్థలే కాకుండా ప్రయాణికులు కూడా ప్రయాణ సమయంలో మరిన్ని ప్రాణరక్షక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సింగపూర్ ఎయిర్ లైన్స్ లండన్ నుంచి బయలుదేరి సింగపూర్‌కు చేరుకునే సమయంలో మధ్యలో అకస్మాత్తుగా సంభవించిన భారీ కుదుపులకు 73 ఏళ్ల గియోఫ్రీ కిచెన్ అనే బ్రిటన్ ప్రయాణికుడు మరణించగా, మరో 20 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదం దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా విమానాల్లో ప్రయాణించే వారిని భయాందోళనలకు గురి చేసింది.విమాన ప్రయాణాల్లో ప్రయాణికుల భద్రతపై అనేక సందేహాలు లేవనెత్తింది. కుదుపులకు దారి తీసిన కారణాలు, దీనితో విమానమే ఛిద్రమై అనేక మంది రక్తగాయాలతో అత్యవసరంగా బ్యాంకాక్‌లో విమానం ల్యాండ్ అయిన దృశ్యాలు ప్రయాణికుల మనసులను అల్లకల్లోలం చేశాయి. కుదుపులు ఇలాంటి ప్రమాదాలు మిగులుస్తాయా అని అంతా ఆందోళన పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విమానం ఇంతగా కుదుపులకు గురి కావడానికి ప్రాథమిక కారణాలను విమాన భద్రతా నిపుణులు ఇప్పటికే తేల్చారు. విమానాలు 3700 అడుగుల పైన ఆకాశంలో ప్రయాణించే సమయంలో అప్పుడప్పుడు మంచు, తుఫాను గాలుల కారణంగా కుదుపులు ఏర్పడతాయి. ఇవి ఒక్కోసారి భీకరంగా ఉంటాయి. ఇలాంటి కుదుపులు సంభవించినప్పుడు పైలెట్లు హెచ్చరికలు జారీ చేస్తారుసీటు బెల్ట్ ధరించాలంటే సిగ్నల్ లైట్ కూడా ప్రతి సీటుకు ఇస్తుంటారు. ఆ సమయంలో ప్రయాణికులు సీటు బెల్ట్‌ను కదలకుండా ఉండేలా బిగించాలి. విమానం బయలుదేరేటప్పుడు, విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యేటప్పుడు సీటు బెల్ట్ ధరించమని చెబుతారు. ఎందుకంటే ల్యాండింగ్ టైమ్‌లో విమాన వేగం అనంతంగా ఉంటుంది. అప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోకుంటే సీటు ముందు భాగానికి తగలవచ్చు లేదంటే క్యాబిన్ హెడ్‌కు తల తగలవచ్చు. ఫలితంగా ప్రయాణికులు గాయాలు పాలయ్యే ప్రమాదం ఉంది. ఇదే కాకుండా ప్రయాణ మార్గంలో వాతావరణంలో మార్పుల కారణంగా విమానం కుదుపులకు గురి కావచ్చు. పైలెట్లు వెదర్ రాడార్‌లో కనిపెట్టి 'కుదుపులున్నాయి సీటు బెల్ట్‌ను పెట్టుకోండి' అని హెచ్చరికలు చేస్తున్నారు. చిన్న, పెద్ద కుదుపుల నుంచి ప్రయాణికులు సురక్షితంగా బయటపడతారు. కానీ సింగపూర్ ఎయిర్ లైన్స్‌కు ఎదురైన కుదుపులు అరుదైనవని విమాన భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఇలాంటివి ఎక్కడైనా జరగాలని, ప్రయాణికులు ప్రయాణమంతా అప్రమత్తంగా ఉండడమే శ్రేయస్కరమని విమానాల అటెండెంట్ల అంతర్జాతీయ అధ్యక్షుడు సారా నెల్సన్ అంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 50 వేల విమానాలు, 20 ప్రముఖ ఎయిర్ లైన్స్‌తో కూడిన సంస్థకు నెల్సన్ అధ్యక్షుడిగా ఉండి సింగపూర్ ఎయిర్ లైన్స్ ప్రమాదం గురించి ప్రయాణికులకు అనేక సూచనలు ఇచ్చారు. సింగపూర్ ఎయిర్ లైన్స్‌కు ఎదురైన 'క్లియర్ ఎయిర్ టర్బులెన్స్' అనేది అత్యంత ప్రమాదకరమైందని నెల్సన్ అన్నారు. ఇది వెదర్ రాడార్‌లో పైలెట్‌కు కనిపించదని, ఇలాంటి అరుదైన కుదుపులను కనిపెట్టే టెక్నాలజీ ఇంకా లేదని ఆయన అన్నారు. గతంలో మార్చి నెలలో బోయింగ్ 787 అనే భారీ విమానం కూడా ఇలాంటి అరుదైన కుదుపులకు గురై 50 మంది గాయాలపాలయ్యారని, అదృశ్యమైన ఇలాంటి కుదుపుల ప్రమాదాలు మునుముందు కూడా ఎదురు కావచ్చని ఆయన తెలియజేశారు. అట్లాగే ప్రయాణికులు 15 నుంచి 24 గంటలు సుదీర్ఘంగా గడిపే సమయంలో మొత్తం సమయం సీటు బెల్ట్ ఎలా పెట్టుకుంటారనే ప్రశ్నలకు నెల్సన్ నుంచి సమాధానం లేదు. అయితే విమాన భద్రతా నిపుణులు ఆంథోని బ్రిక్ హౌజ్ ఒక పరిస్థితిని సూచిస్తున్నారు. ఇది అందరూ పాటిస్తే కొంత మేరకైనా నష్టాన్ని నివారించే అవకాశముంది. అదృశ్య కుదుపులను కనిపెట్టే అవకాశం పైలెట్లకు లేనప్పుడు అప్రమత్తంగా ఉండే ప్రయాణికుల విమానం కుదుపులకు ఊహించినట్లుగానే సీటు బెల్ట్‌లు పెట్టుకోవాలని, ఆ సమయంలో విమానం లోపల టాయిలెట్లకో, ఇతరత్రా అవసరాల కోసమే తిరగడం మానేయాలని ఆయన సూచిస్తున్నారు. దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా విమాన యానం ప్రస్తుత పరిస్థితుల్లో సగటు ప్రయాణికులు కుదుపుల నుంచి రక్షించుకోవడానికి పై సూచనలు పాటించడం మినహా మరో మార్గం లేదు.

# ఇలా పోలింగ్ ముగియగానే అలా మాయం ...

అమరావతి : దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికలు జరుగుతున్నాయి. దేశంలో ఏడు దశల్లో ఈ ఎన్నికలను చేపడుతోంది భారత ఎన్నికల సంఘం... ఇందులో ఇప్పటికే ఐదు దశల పోలింగ్ ముగిసింది. మరో రెండు దశల పోలింగ్ జరగాల్సి వుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. అయితే దేశంలో జరుగుతున్న లోక్ సభ ఎన్నికలు ఒక ఎత్తయితే... ఆంధ్ర ప్రదేశ్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు మరోఎత్తు. నాలుగో దశలో అంటే మే 13న ఏపీలోని 25 లోక్ సభ స్థానాలతో పాటే 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ ముగిసింది... అయినా ఇంతవరకు రాష్ట్రంలో పొలిటికల్ హీట్ తగ్గలేదు. పోలింగ్ ముగిసి పదిరోజులు దాటినా ఇప్పటికీ కొన్నిప్రాంతాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. రాజకీయ ప్రత్యర్థులు వైసిపి, టిడిపి మధ్య నిత్యం పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి వుంటుంది. అలాంటి ఎన్నికల సమయంలో పరిస్థితి మరీ దారుణం... ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు మరింత రెచ్చిపోతుంటారు. ఈ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల సమయంలోనే అదే జరిగింది. పోలింగ్ నోటిఫికేషన్ నుండి ఇటీవల పోలింగ్ ముగిసేవరకు వైసిపి, టిడిపి కూటమి మధ్య ఘర్షణ వాతావరణం. పోలింగ్ పూర్తయింది కాబట్టి పరిస్థితి ప్రశాంతంగా మారుతుందని అందరూ అనుకున్నారు... కానీ అలా జరగడంలేదు. ఇప్పటికీ పల్నాడు వంటి ప్రాంతాల అలజడులు కొనసాగుతున్నాయి. ఇలాంటి సమయాల పార్టీ శ్రేణులను సముదాయించి రాష్ట్రంలో శాంతియుత వాతావరణం వుండేలా చూడాల్సిన బాధ్యత గల ప్రధాన పార్టీల అధినేతలు ఎక్కడా కనిపించడం లేదు. పోలింగ్ ముగియగానే రాష్ట్రం ఎటుపోతే మాకెందుకు అనుకున్నారో ఏమో నాయకులంతా హాలిడే మూడ్ లోకి వెళ్లిపోయారు. ఆంధ్ర ప్రదేశ్ దాదాపు నెల రోజులపాటు ఎన్నికల హడావిడి జోరుగా సాగింది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభలు, బస్సు యాత్రలతో ప్రజలవద్దకు వెళ్లారు. ఇక ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కూడా నిత్యం ప్రజల్లోనే ఉన్నారు. వీరంతా మండుటెండలను సైతం లెక్కచేయకుండా ప్రచారం చేశారు. ఇక అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలంతా సమావేశాలు, ఇంటింటి ప్రచారాలు, రోడ్ షో, ర్యాలీలు... ఇలా ఏదో ఒక పేరుతో ప్రచారంలో ఉన్నారు. మైక్ సెట్ మోతలు, బ్యాండ్ చప్పుళ్లు, పార్టీల నినాదాలతో నగరాలు, పట్టణాలే కాదు మారుమూల గ్రామాలు సైతం మారుమోగాయి. పోలింగ్ వరకు ఇదంతా... ఒక్కసారి ఈవిఎంలలో ప్రజా తీర్పు నిక్షిప్తం కాగానే పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అప్పటివరకు ప్రజల్లో వున్న నాయకుల్లో కొందరు ఇప్పుడు కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రలు, మరికొందరు విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రధాన పార్టీల ముఖ్య నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు?

వైఎస్ జగన్మోహన్ రెడ్డి :

ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ కలిసి కూటమిగా వచ్చినా వైసిపి మాత్రం ఒంటరిగానే బరిలోకి దిగింది. దీంతో పార్టీని గెలిపించుకునే బాధ్యత వైఎస్ జగన్ తీసుకున్నారు. నోటిఫికేషన్ కు ముందునుండే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసి అందరికంటే ముందే ప్రచారాన్ని కలిగి ఉంది. ఇలా దాదాపు నెలరోజులపాటు అసలు విరామం అన్నదే ప్రచారం జరిగింది. ఇలా ఎన్నికల



ప్రచారంతో బాగా అలసిపోయిన జగన్ ప్రస్తుతం భార్యాపిల్లలతో కలిసి విదేశాల్లో పర్యటిస్తున్నారు.

మే 17న ప్రత్యేక విమానంలో భార్య భారతితో కలిసి విజయవాడ విమానాశ్రయం నుండి లండన్ వెళ్లారు జగన్. అక్కడ చదువుకుంటున్న కూతుళ్లతో కలిసి ఆయన ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ లతో పర్యటిస్తున్నారు. ఈ నెలాఖరులో లేదంటే జూన్ ఫస్ట్ న ఆయన తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు.

చంద్రబాబు నాయుడు :

తెలుగుదేశం పార్టీ అదినేత నారా చంద్రబాబు నాయుడు ప్రస్తుతం కుటుంబంతో కలిసి సరదాగా గడుపుతున్నారు. పోలింగ్ ముగియగానే తిరుమలకు వెళ్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు చంద్రబాబు దంపతులు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ నామినేషన్ కార్యక్రమం కోసం వారణాసి వెళ్లారు. అనంతరం మహారాష్ట్రలోకి ప్రముఖ దేవాలయాలను సందర్శించారు. కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారిని, షిరిడి సాయిబాబను భార్య భువనేశ్వరితో కలిసి చంద్రబాబు దర్శించుకున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ లోని తన నివాసంలోనే వుంటూ కుటుంబంతో హాయిగా గడుపుతున్నారు.

పవన్ కల్యాణ్ :

జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటినుండి ఆంధ్ర ప్రదేశ్ కే పరిమితం అయ్యారు. తాను పోటీచేసిన పిఠాపురంలోనే ఓ ఇంటిని తీసుకుని వున్నారు. జనసేన అభ్యర్థులతో పాటు కూటమి తరపున ముమ్మర ప్రచారం నిర్వహించారు. పోలింగ్ రోజు వరకు ఏపీలోనే వున్నారు పవన్ కల్యాణ్. అయితే పోలింగ్ రోజు మంగళగిరిలో ఓటేసిన పవన్ కల్యాణ్ దంపతులు సాయంత్రం ప్రత్యేక హెలికాప్టర్ లో హైదరాబాద్ కు చేరుకున్నారు. అక్కడినుండి విమానంలో వారణాసికి చేరుకుని రాత్రి బస చేసారు. ఆ తర్వాతి రోజు ప్రధాని మోదీ నామినేషన్ కార్యక్రమంలో పవన్ పాల్గొన్న పనిలో భార్యతో కలిసి కాశీ విశ్వనాథుడిని దర్శించుకున్నారు. అనంతరం పవన్ దంపతులు హైదరాబాద్ కు చేరుకున్నారు. ప్రస్తుతం పవన్ షూటింగ్ లలో కూడా పాల్గొనడం లేదట... ఇంటికే పరిమితమై కుటుంబంతో గడుపుతున్నట్లు సమాచారం. అయితే పవన్ కొద్దిరోజులు భార్యతో కలిసి విదేశాలకు హాలిడే ట్రిప్ వెళ్లేందుకు కనిపించింది.

# ఇలాంటి పరిస్థితి గతంలో చూడలేదు

తిరుమల,ఈవీఎం ధ్వంసంలో వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి జూన్ 6వ తేదీ వరకు అరెస్ట్ చేయొద్దంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆశ్చర్యానికి గురి చేసిందని మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన తిరుమలకు వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇలాంటి తీర్పు వచ్చి ఉండదని.. ఉన్నత న్యాయస్థానాలు ఈ తీర్పుపై పునరాలోచించాలని కోరారు. పిన్నెల్లిని వెంటనే అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని అప్పుడే ప్రజాస్వామ్యం ఉందనే నమ్మకం ఏర్పడుతుందని, న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని వ్యాఖ్యానించారు. పోలీసుల సహకారంతోనే పిన్నెల్లి తప్పించుకున్నారని, పిన్నెల్లిని అరెస్ట్ చెయ్యకుండా 3 రోజుల పాటు పోలీసులు కాలక్షేపం చెయ్యడంతో న్యాయస్థానంలో పిన్నెల్లికీ ఊరట లభించిందని బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఈవీఎంను ధ్వంసం చేసిన వ్యవహారంలో మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఊరట లభించింది. ఆయనకు షరతులతో కూడిన మధ్యంతర ముందస్తు బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. జూన్ 6 వరకు ఆయన్ను అరెస్టు చేయవద్దని, తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ఆయన కదలికలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు నిఘా ఉంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)ని ఆదేశించింది. ఆయన వెంట నలుగురు వ్యక్తులకు మించి ఉండకూడదని తేల్చిచెప్పింది. ఆయన దర్యాప్తునకు ఆటంకం కలిగించడం గానీ, సాక్షులను బెదిరించడం గానీ చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. మధ్యంతర ముందస్తు బెయిల్ సమయంలో ఎలాంటి నేర ఘటనలకు పాల్పడడానికి వీల్లేదని ఆదేశించింది. విచారణ ను జూన్ 6కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం రాత్రి ఆదేశాలిచ్చారు. నెల 13న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మాచర్ల నియోజకవర్గం పాల్వాయ్ గేటు పోలింగ్ బూత్‌లో ఈవీఎం, వీవీప్యాట్‌ను ధ్వంసం చేసిన వ్యవహారంలో పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ

# నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

భద్రాచలం పారా మెడికల్ కళాశాల వద్ద ఆందోళన

భద్రాచలం,మే24(ఆర్ఎన్ఎ): నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద మృతికి నిరసనగా భద్రాచలం పారా మెడికల్ కళాశాల వద్ద విద్యార్థులు, బంధువులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. దీంతో ఇక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నర్సింగ్ విద్యార్థిని కారుణ్య గురువారం ఉదయం అపస్మారక స్థితిలోకి వెళ్లారు. కళాశాల ప్రాంగణంలో గాయాలతో పడి ఉన్న ఆమెను.. యాజమాన్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందింది. విద్యార్థిని మృతితో పారా మెడికల్ కళాశాల వద్ద శుక్రవారం బంధువులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వాసుపత్రి నుంచి ర్యాలీగా కళాశాల వద్దకు వచ్చారు. కారుణ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలకు వచ్చిన ఛైర్మన్‌పై దాడికి విద్యార్థులు, బంధువులు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. స్థానిక నర్సింగ్ కళాశాల విద్యార్థిని కారుణ్య (18) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ నేపథ్యంలో ఆమె బంధువులు.. కళాశాల ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. ఆమె కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని.. అలాగే నర్సింగ్ కళాశాలను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గురువారం ఉదయం కళాశాలలో కారుణ్య అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఈ విషయాన్ని గమనించిన కాలేజీ యాజమాన్యం.. ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించింది. ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతూ.. సాయంత్రం మరణించింది. దీంతో ప్రభుత్వాసుపత్రి నుంచి కళాశాల వరకు కారుణ్య మృతదేహంతో ఆమె బంధువులు, కళాశాల విద్యార్థులు ర్యాలీగా చేరుకుని.. ఆందోళన చేపట్టారు. ఆ క్రమంలో కళాశాల వద్దకు చేరుకున్న చైర్మన్‌పై కారుణ్య బంధువులు దాడికి యత్నించగా.. వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు.

# మల్లారెడ్డి చెరలో చెరువు శిఖం భూములు

మేడ్చల్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి కి మరో షాక్తగిలింది. షామీర్ పేట్ మండలంలోని బొమ్రాసిపేట్ పెద్ద చెరువు శిఖం భూముల్లో నిర్మించిన ప్రహరీ గోడను అధికారులు కూల్చివేశారు. చెరువు ఎఫ్టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు చేశారంటూ మల్లారెడ్డిపై ఫిర్యాదులు వచ్చాయి. దీంతో జేసీబీల సాయంతో చెరువులో నిర్మించిన ప్రహరీ గోడలను ఇరిగేషన్ ,రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అలాగే పెద్ద చెరువును ఆక్రమించి నిర్మించిన మరికొన్ని నిర్మాణాలను కూల్చివేశారు.కాగా నగర శివార్లలోని కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల గ్రామంలోని సుచిత్ర పరిధిలో సర్వేనంబరు 82, 83లలో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఇతరుల మధ్య నెలకొన్న భూ వివాదం తెలిసిందే. అయితే రెండున్నర ఎకరాల భూమి తనదేనంటూ మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్‌రెడ్డి వాదిస్తున్నారు. అందులో 1.11 ఎకరాల భూమి తమదని మరో 15 మంది చెబుతున్నారు. కాగా నాలుగు రోజుల క్రితం సర్వే నెం.82లోని స్థలంలో మల్లారెడ్డి, ఆయన అల్లుడుకు.. మరో 15మంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక్కొక్కరం 400 గజాల చొప్పున గతంలో భూమిని కొనుగోలు చేశామని, కోర్టు సైతం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని 15మంది పేర్కొంటున్నారు. అయితే ఆ స్థలంపై కోర్టు ఆర్డర్ ఉన్నందున స్థలంలో ఎలాంటి గొడవలు చేయొద్దని ఇరువర్గాలకు పోలీసులు సర్దిచెప్పారు. అయితే మల్లారెడ్డి అనుచరులు తమను భయపెడుతున్నారని పోలీసులకు 15మంది సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ భూముల వివాదం ఇంకా కొనసాగుతోంది. ఈ విషయంపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం మల్లారెడ్డి బాధితులు సమావేశం నిర్వహించారు. మరోసారి మల్లారెడ్డిపై బాధితులు సంచలన ఆరోపణలు చేశారు. పూలు, పాలు అమ్ముడే కాదు... మల్లారెడ్డి భూ కబ్జాలు కూడా చేస్తున్నాడు. పేట్ బషీరాబాద్‌లోని 82 సర్వే నంబర్‌లో ఎకరం 29 గుంటల కన్నా.. ఎక్కువ ఉంటే మీకు సారీ చెప్పి రాజకీయాల నుంచి వెళ్లిపోతానని మల్లారెడ్డి చెప్పాడని... కానీ మమ్ముల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. రెవెన్యూశాఖ అధికారులు ఆదివారం చేసిన సర్వేలో 82 సర్వే నంబర్‌లో మల్లారెడ్డికి చెందిన ఎకరం 29 గుంటలతో పాటు.. మాకు చెందిన 33 గుంటలు అందులో కలిసిపోయింది. మల్లారెడ్డికి చెందిన ఎకరం 29 గుంటలు వదిలేసి.. మా 33 గుంటలను మాకు పొజిషన్ ఇప్పించాలి. మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి ముందే ఈ సర్వే జరిగింది. మల్లారెడ్డి మాట మీద నిలబడాలి' అని బాధితులు పేర్కొన్నారు.

# పారదర్శకత రావాలి

న్యూఢిల్లీ, భారతదేశానిది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. ఇందుకు అనుగుణంగా మన ఆర్థిక విధానాలు రూపొందించుకోవాలి. ప్రజలను దొంగల్లాగా చూసే విధానాలు పోవాలి. పనిగట్టుకుని వారి ఇంట్లో తొంగిచూసి, వారు రూపాయి సంపాదించుకున్న కన్నేసి పట్టుకుపోయే విధానం మారాలి. వారు రూపాయి దాచుకున్నా అనుమానించే అడ్డమైన చర్యలు సరికాదు. నిజానికి ప్రజలు కడుపు కాల్చుకుని పొదుపు చేస్తుంటారు. రేపటి అసవరాలకు గాను పొదుపును అలవాటుగా మార్చుకున్నారు. ఇలా కూడబెట్టినదంతా సంపాదనకింద చూపాలంటే ఎలా సాధ్యమన్నది పాలకులు ఆలోచన చేయడం లేదు. ప్రధానంగా బ్యాంకులను ప్రజలకు చేరువ చేయాలి. డబ్బులను ధైర్యంగా బ్యాంకుల్లో వేయగలగాలి. ఇబ్బడిముబ్బడిగా బ్యాంకులు వేస్తున్న వడ్డింపులు దారుణంగగా ఉన్నాయి. టిడిఎస్ విధానంలోనూ మార్పులు రావాలి. ఆర్థిక రంగ సంస్కరణలపై ఆలోచన చేయాలి. బ్యాంకుల్లో వేసిన ప్రతిపైసాకు లెక్క చెప్పడం సాధ్యం కాదు. ఇకపోతే పైసాపైసా పొదుపు చేసుకుని బీమా కట్టినా దానిపైనా జిఎస్టీ వడ్డింపులు దారుణం కాక మరోటి కాదు. ఆరోగ్య బీమాపై జిఎస్టీ ఎంతవరకు సమంజసమో ఆలోచన చేయాలి. అతిగా డబ్బులు పోగయితే దానిగురించి అడగవచ్చు. ఆదాయం చూపమని కోరవచ్చు. కానీ 50 వేలకే లెక్కలు అడగడం వల్ల ప్రజలు బ్యాంకుల వైపు పోవడం లేదు. దాచుకోవాల్సిన డబ్బు విషయంలో ఓ విధానం అంటూ ఉండాలి. అది అక్రమమా సక్రమమా అన్నది గుర్తించకుండా డబ్బు కనిపిస్తే దానిపై పన్ను వేయడం, ఐటి దాడులు చేయడం వల్ల డబ్బులు దాచుకునేందుకు విదేశాలపై ఆధారపడుతున్నారు. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి. ఎన్నికలు అయ్యాక తగిన మెజారిటీ సమకూరని సందర్భాలలో ఎమ్మెల్యేలు లేదా ఎంపీల బేరసారాల కోసం ఈ నల్లధనాన్నే వాడుతున్నారు. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్లడబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ప్రజలకు అందని నగదు రాజకీయ పార్టీలకు మాత్రం లభిస్తోంది. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం చూస్తున్నాం. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. ఎన్నికలలో డబ్బు అవసరం లేకుండా సంస్కరణలు తీసుకుని రాకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా లాభం లేదు. రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం అధికారమే కనుక,

# సోనియాను ఏ హోదాలో ఆహ్వానిస్తారు

సూర్యాపేట,జూన్ 2న సోనియా గాంధీని ఏ హోదాలో రాష్ట్రానికి పిలుస్తారని సూర్యాపేట శాసనసభ్యుడు జగదీష్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం మళ్లీ పరాయి పాలనలోకి వెళ్లిందని జగదీష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ రాష్ట్రంలో సగం పాలన ఢిల్లీ నుంచి చేయాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఏ పని చేయాలన్న ఢిల్లీలో అనుమతి తీసుకుని చేయాలి. రాష్ట్ర హక్కులు, నదీ జలాలను హరిస్తున్నారని విమర్శించారు. పదేళ్లుగా ఎంతో బాగా పాలన చేశాం. 2014 జూన్ రెండు నుంచి 2023 డిసెంబర్ వరకు తెలంగాణ రాష్ట్రాన్ని తెలంగాణ వాళ్లు పరిపాలించుకున్నారు. మళ్లీ దురదృష్టవశాత్తు పరాయి పాలన వచ్చి ఢిల్లీపై ఆధార పడాల్సిన దురదృష్టం వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కరెంట్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సెల్‌ఫోన్ లైట్లతో హాస్పిటల్స్‌లో ఆపరేషన్లు చేస్తున్న విషయాలు పత్రికల్లో వచ్చాయంటే అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. దాడులు చేసి అక్రమ కేసులు పెట్టినా తెలంగాణ ప్రజలకు పోరాటం కొత్త కాదు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు కేసీఆర్ వైపే చూస్తున్నారని తెలిపారు.

# హ్యాండ్ ఇచ్చేస్తారా ?

అమరావతి,బీజేపీ గ్రాఫ్ జాతీయ స్థాయిలో తగ్గుతోంది అని వార్తలు వస్తున్నాయి. మేము గెలుస్తున్నామని ప్రతీ విడతకూ ఒకసారి నంబర్ ని పెంచుకుంటూ ఆ పార్టీ నేతలు చెప్పుకుంటూ వస్తున్నారు. ఇప్పటికి అయిదు విడతలుగా ఎన్నికలు జరిగితే 325కి పైగా బీజేపీ ఖాతాలోకి సీట్లు వచ్చాయని ఆ పార్టీ బిగ్ షాట్స్ చెబుతున్నారు.అంటే మ్యాజిక్ ఫిగర్ ని ఏనాడో దాటేసామని చెబుతున్నారు. మరో రెండు విడతల పోలింగ్ ఉంది అంటే అవన్నీ తమకు బోనస్ గా వచ్చే సీట్లు అని అంటున్నారు. కేంద్ర మంత్రి అమిత్ షా అయితే కాంగ్రెస్ కి ఈసారి 40 సీట్లు కూడా రావు అని అంటున్నారు. 2019లో ఆ పార్టీకి 50కి పైగా సీట్లు వస్తే ఈసారి పది కట్ చేసి అమిత్ షా చెప్తున్నారు.ఇవన్నీ ఇలా ఉంటే రాజకీయ పార్టీలు అన్నాక ఆర్భాటం చేస్తాయి. ఎక్కువగానే చెప్పుకుంటాయి. అలా బీజేపీ మేమే అధికారంలోకి వచ్చేస్తున్నామని చెప్పుకుంటోంది అని అంటున్నారు. ఏపీలో చూస్తే రాజకీయం ఎన్నికల ఫలితాల తరువాత మారుతుందా అన్న చర్చ అపుడే మొదలైంది.బీజేపీని టీడీపీ కూటమిలోకి చేర్చుకుంది. అలాగే ఎన్డీయేకు మిత్రుడిగా మరోసారి బాబు వచ్చి చేరారు. ఆయన మోడీని విశ్వ గురు అని కూడా కీర్తిస్తున్నారు. బీజేపీయే కేంద్రంలో అధికారంలోకి వస్తుందని బాబు జోస్యం చెబుతున్నారు. అంతే కాదు మోడీ సైతం బాబుని ప్రియ మిత్రమా అని సంభోదిస్తున్నారు. ఈ పలకరింపులు అన్నీ కూడా రాజకీయ అవసరాలుగానే చూడాలని అంటున్నారు.ఇదిలా సాగుతూండగానే మరో వైపు టీడీపీ అనుకూల మీడియాలో బీజేపీకి వ్యతిరేక కథనాలు పుంఖానుపుంఖాలుగా వస్తున్నాయి. ఏపీకి బీజేపీ పదేళ్ల కాలంలో ఏమీ చేయలేదని విభజన హామీలు నెరవేర్చలేదని ఏపీ ఇలా మారిపోవడానికి కారణం బీజేపీ అంటూ పాపాల భైరవుడిగా బీజేపీని చిత్రీకరిస్తున్నారు. ఈ రాతలు అన్నీ కూడా పోలింగ్ వేళ దాకా కనిపించలేదు.ఇపుడు ఏపీలో ఎన్నికలు ముగిసాయి కాబట్టి మరోమారు డేరింగ్ గా కలం ఝుళిపించి పెద్ద ఎత్తున రాతలు రాస్తున్నారు అని అంటున్నారు. ఈ రాతల వెనకనే అసలైన వ్యూహాలు ఉన్నాయని అంటున్నారు. బీజేపీకి గ్రాఫ్ తగ్గుతోందని జాతీయ మీడియాలో వార్తలు రావడం మరో వైపు ఇండియా కూటమి మేమే అధికారంలోకి వస్తున్నామని ప్రకటించుకోవడం వంటి పరిణామాలతో జాతీయ స్థాయిలో కౌంటింగ్ తరువాత ఏమైనా జరగవచ్చు అని ఊహిస్తున్నారు.బీజేపీకి మెజారిటీ రాకపోతే మాత్రం ఏపీలో పెద్ద షేక్ హ్యాండ్ ఆ పార్టీకి రెడీగా ఉంటుందని అంటున్నారు. దానికి ముందస్తు ప్రిపరేషన్ గానే ఈ రాతలా అన్న చర్చ సాగుతోంది. టీడీపీ అనుకూల మీడియా రాసింది అంటే అది టీడీపీని ప్రభావితం చేయడానికే అని అంటున్నారు.అయినా పొత్తులు ఎత్తులు విడాకులు పెడాకులు అవడం ఇటీవల కాలంలో కామన్ అయింది. ఇక ఏపీకి బీజేపీ ఏమీ చేయలేదని చెబుతూ ఇండియా కూటమికి కాస్తా మొగ్గు కనిపిస్తే ఆ వైపునకు వెళ్ళేలా ఏమైనా జరుగుతోందా అన్న చర్చ కూడా సాగుతోంది. చంద్రబాబు జాతీయ స్థాయిలో ప్రముఖ నాయకుడు. ఆయన 2019 దాకా జాతీయ స్థాయిలో ఒక వెలుగు వెలిగారు.ఏపీలో అధికారం కోల్పోవడంతో ఆయన అలా ఉండిపోయారు. ఒకసారి కనుక ఏపీలో అధికారం దక్కితే ఎక్కువ ఎంపీ సీట్లు చేతిలో ఉంటే బాబు చక్రం మరోసారి జాతీయ స్థాయిలో గిర్రున తిరుగుతుంది అని అంటున్నారు. ఆయనకు ఇండియా కూటమితోనూ మంచి పరిచయాలు ఉన్నాయని కూడా అంటున్నారు. బీజేపీకి తగినన్ని సీట్లు రాకపోతే మాత్రం ఏపీ నుంచే సంచలన నిర్ణయాలకు ఆస్కారం ఉంటుంది అని అంటున్నారు.ఏపీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకుంటామని కూడా చెప్పే వీలుంది అంటున్నారు. కాంగ్రెస్ అయితే ప్రత్యేక హెూదా ఇస్తుంది, అలాగే విభజించిన కాంగ్రెస్ నుంచే నిధులు పొందే చాన్స్ ఉంటుంది అన్నది మేధావుల ఆలోచన. ఈ పరిణామాల నేపథ్యంలో ఏపీలో రాజకీయాన్ని మలుపు తిప్పే విధంగా ఒక వైపు అనుకూల మీడియాలో వార్తలు వస్తున్నాయని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## హైదరాబాద్‌లో కిడ్నీ రాకెట్

హైదరాబాద్,నగరంలో మరో అంతర్జాతీయ కిడ్నీ రాకెట్ గుట్టు రట్టయ్యింది. కేరళకు చెందిన యువకుడి మృతితో ఆ రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కీలక సూత్రధారి హైదరాబాద్‌కుచెందిన వైద్యుడిగా గుర్తించారు. కొంతకాలంగా పేదలకు డబ్బు ఆశ చూపి విదేశాలకు తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేస్తూ దందా సాగిస్తున్నారు. కిడ్నీ మార్పిడి చేయించుకున్న యువకుడు మృతిచెందడంతో ఈ వ్యవహారం బయటకొచ్చింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. కేరళలో ఓ యువకుడు అనారోగ్యంతో మృతిచెందాడు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమారుడి ఈ మధ్యనే కిడ్నీ మార్పిడి చేయించుకున్నాడని, అందుకు దళారులు రూ.20లక్షలు ఆశ చూపారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సబిన్ అనే దళారిని కోచి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకుని విచారించారు. కీలక సూత్రధారులు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్, మరో ముగ్గురు కలిసి దందా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. యువకుడిని ఇరాన్ తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేశారని, రూ.20లక్షలు ఇస్తామని చెప్పి రూ.6లక్షలే ఇచ్చినట్లు దర్యాప్తులో తేలినట్లు కేరళ పోలీసులు పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా కేరళ పోలీసులు హైదరాబాద్ చేరుకున్నారు. హైదరాబాద్, కేరళకు చెందిన 40మంది యువకులను ఇరాన్ దేశం తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేయించినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల్లో ఎక్కువమంది పేదలే ఉన్నట్లు వారు తెలిపారు. నగరానికి చెందిన ఒక వైద్యుడితోపాటు మరో ఇద్దరు దళారుల కోసం కేరళ పోలీసులు వెతుకుతున్నారు. కేరళలోని ఎర్నాకులం కేంద్రంగా వ్యవహారం నడుపుతున్నారని, పేదలను

# రైతును చుట్టుముట్టిన రాజకీయం..

హైదరాబాద్,రాష్ట్రంలో రైతుల చుట్టూ రాజకీయం సాగుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ మధ్య రాజకీయ పార్టీలకు రైతన్నపై ప్రేమ పొంగిపొర్లుతోంది. రైతాంగ సమస్యలే ప్రధాన ఏజెండగా రాజకీయ విమర్శలు సాగుతున్నాయి. బీఆరెస్, బీజేపీ ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసి విమర్శలదాడి చేస్తున్నాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతాంగానికిచ్చిన హామీలే అస్త్రంగా విపక్షపార్టీలైన బీఆరెస్, బీజేపీ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కిషన్ రెడ్డి, లక్ష్మణ్ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా రైతాంగానికిచ్చిన హామీల పట్ల మీ ప్రభుత్వాలకు కనీస కట్టుబాటు లేదని మండిపడుతున్నారు.దీనికి ప్రతిగా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్కలు తమ ప్రభుత్వానికి ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయడం పట్ల చిత్తశుద్ధి ఉందంటున్నారు. తమ ప్రభుత్వ అంకితభావాన్ని ప్రకటించేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెబుతున్నారు. మొత్తానికి గత ఆరునెలలుగా రైతాంగం పై తమకే ప్రేమ ఉందంటూ మూడు పార్టీల నాయకులు తమకుతామే కితాబులిచ్చుకుంటున్నారు. దేశానికి వెన్నెముక రైతన్న అనే నినాదాన్ని నాయకులు నిత్యం స్మరిస్తున్నారు.

రైతు సమస్యలపై పార్టీల హామీ

రాష్ట్రంలో మెజార్టీ ప్రజలు వ్యవసాయ రంగం పై ఆధారపడి జీవిస్తున్నారనేది బహిరంగ సత్యం. ఈ నేపథ్యంలో రైతులు ప్రధాన భూమికగా ఏ ప్రభుత్వమైనా వారి సంక్షేమం, అభివృద్ధి, సమస్యలను పరిష్కరించాల్సి ఉంటోంది. ఈ మేరకు ఎన్నికలొచ్చాయంటే రైతుల ఓట్లు ప్రధానంగా మారుతున్నాయి. ఈ కారణంగానే రైతుల సమస్యలు, పరిష్కారాలపై పార్టీలు వాగ్ధానాలు చేయడం పరిపాటిగా మారింది.ఈ సారి అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచే అన్ని పార్టీలు, తమ మెనిఫెస్టోల్లో రైతాంగానికి అనేక వాగ్ధానాలిచ్చారు. ఇందులో కాంగ్రెస్, బీఆరెస్ పోటీపడ్డాయికాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్ పేరుతో రైతాంగ సమస్యలను వాగ్ధానంగా ప్రకటించారు. తర్వాత తమ మెనిఫెస్టోలో రైతుభరోసా కింద రూ.15వేలు, రూ.2లక్ష-ల రుణమాఫీ, ధాన్యానికి రూ.500 బోనస్, పంటల బీమాతో పాటు మరి కొన్ని వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారానికి వాగ్ధానం చేశారు. బీఆరెస్ సైతం కాంగ్రెస్ హామీలకు అటుఇటూగా హామీలిచ్చింది. తాము తెచ్చిన రైతు బంధు, రుణమాఫీ అమలుతోపాటు ఇతరత్రా సమస్యలను పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చారు. బీజేపీ కూడా రైతాంగానికి మద్ధతు ధర ప్రకటిస్తామంటూ చెప్పింది. మూడు ప్రధాన పార్టీలు రైతులను తమవైపు తిప్పుకునేందుకు తీవ్రంగా పోటీపడ్డాయి.

ఎన్నికల్లో అన్నదాత ఎజెండా

అసెంబ్లీ ఎన్నికల్లో రైతుల సమస్యలు, ధాన్యం దిగుబడి, నీటిపారుదల రంగం, కాళేశ్వరం ప్రాజెక్టు పై అవినీతి ఆరోపణలు, ప్రత్యారోపణలతో ప్రచారం సాగింది. తమ హయంలో రైతాంగ సమస్యలు తీర్చి బంగారు తెలంగాణగా మార్చామని, తెలంగాణ ధాన్యాగారమైందని బీఆరెస్ గొప్పగా చెప్పింది. ఎన్నికల ప్రచార సమయంలోనే కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధానమైన మేడిగడ్డ బారేజ్ పిల్లర్లు కుంగిపోయిన తర్వాత బీఆరెస్ నేత కేసిఆర్ మౌనం వహించగా కాంగ్రెస్ బీఆరెస్ పై విమర్శలెక్కుపెట్టింది. బీజేపీ కేంద్రంలో రైతులు సమస్యలు తీర్చకుండా మూడు నల్ల చట్టాలు తెచ్చారని, వందలాది మంది రైతుల ఉసురుతీసిందని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఎన్నికలు ముగిశాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.

రైతు చుట్టూ రాజకీయం

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి రాష్ట్రంలో రైతాంగ సమస్యలపై



ప్రారంభమైన రాజకీయ పోటీ ఇప్పటికీ కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకిచ్చిన హామీల పై కాంగ్రెస్, బీఆరెస్ పరస్పరం తీవ్ర విమర్శలు, ఆరోపణలు చేసుకున్నారు. తర్వాత పార్లమెంటు ఎన్నికల్లో ఆరు గ్యారంటీలతో పాటు రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని పేర్కొంటూ బీఆరెస్, బీజేపీ తీవ్రంగా ప్రచారం చేశాయి. రాష్ట్రంలో నెలకొన్న కరువు సైతం కాంగ్రెస్ తెచ్చిందంటూ విమర్శించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ పొలాలను సందర్శించారు. రైతు భరోసా అమలు చేయలేదని, రుణమాఫీ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ముగిసిన రెండోరోజే ధాన్యం కొనుగోళ్ళ పై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నారంటూ బీఆరెస్ ఆందోళనలు చేపట్టింది. ఆ పార్టీ మాజీ మంత్రులు,ఎమ్మెల్యేలు వీలైన చోట్ల క్షేత్రస్థాయిలో ధాన్యం కల్లాలను పరిశీలన చేస్తున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీఆరెస్, బీజేపీ, నాయకులు పోటీపడుతున్నారు. తాజాగా ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఇదే సమస్యను రెండు పక్షాల నాయకులు ప్రచారం చేస్తున్నారు.వచ్చే సీజన్ నుంచి సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటిస్తామని ప్రభుత్వం ప్రకటించగా సన్న వడ్లతో పాటు దొడ్డు వడ్లకు కూడా బోనస్ చెల్లించాలంటూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం రెండు పార్టీల నాయకులు చేస్తున్నారు. బీఆరెస్, బీజేపీ నాయకులు తీరుపై కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఎన్నికల్లో తామిచ్చిన హామీల అమలుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు. రైతాంగం పై తమ చిత్తశుద్ధిని అనుమానించకూడదంటున్నారు. ఇప్పటికే రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమచేసినట్లు ప్రకటించారు. ఆగస్టు 15 నాటికి రుణమాఫీ అమలు చేస్తామని భరోసా ఇస్తున్నారు. వచ్చే సీజన్ నుంచి సన్న ధాన్యానికి బోనస్ అందిస్తామని ప్రకటించారు. బీఆరెస్, బీజేపీ నేతల తీరుపై కాంగ్రెస్, ప్రభుత్వ ప్రతినిధులు విమర్శిస్తున్నారు.

విపక్షాలది ఫక్తు రాజకీయం

తాము అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లో రైతు భరోసా అమలు చేశాం. రుణమాఫీ అమలుకు డెడ్లైన్ ప్రకటించారు. పంటల బీమా అమలుకు చర్యలు చేపట్టాం. ధాన్యం కొనుగోలు సాగుతున్నాయి. తడిసిన ధాన్యం, మొలక వచ్చిన ధాన్యాన్ని కూడా ఎం ఎస్ పి రేటుకు కొనుగోలు చేస్తామని ప్రకటించాం అయినా విపక్షాలు విమర్శించడంలో చిత్తశుద్ధి లేదని మంత్రి సీతక్క విమర్శిస్తున్నారు. ఇదేమి పట్టించుకోకుండా రైతులను ముందు పెట్టి రాజకీయం చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా తామే రైతుల పక్షపాతిమంటూ చెప్పుకునేందుకు ఎవరికివారు మూడు పార్టీల నాయకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం రైతుల చుట్టూ రాష్ట్రంలో రాజకీయం రంజుగా సాగుతోంది. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నందున ఈ అంశం మరింత చర్చకు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

# తండా మొత్తంగా విద్యుత్ షాక్

కామారెడ్డి, సాధారణంగా విద్యుత్ షాక్తో ఒకరిద్దరూ మృతిచెందుతున్న ఘటనలు మనం తరచూ చూస్తుటాం... కానీ గ్రామ పంచాయతీలోని ప్రతి ఇంటికీ విద్యుత్ షాక్ వచ్చిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పలుగుట్ట తండాలో చోటు చేసుకుంది. గురువారం రాత్రి ఒక్కసారిగా తండాలోని అన్ని నివాసపు ఇళ్లకు విద్యుదాఘాతం అవ్వడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఒక్కసారిగా ప్రాణభయంతో ఇళ్ల నుంచి పరుగులు తీశారు. ముగ్గురు తండావాసులు ప్రమాదానికి గురికాగా వారిని ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, ఏదో ఒక ఇంటికి కాకుండా గ్రామంలోని ప్రతి ఇంటికీ విద్యుత్ షాక్ రావడం అధికారుల అలసత్వానికి నిదర్శమని గ్రామస్థులు అన్నారు. అధికారుల తీరుపై వారు మండిపడ్డారు. కొండాపూర్ సబ్ స్టేషన్ను ముట్టడించి నిరసన తెలిపారు. దేవుడి దయతో తామంతా ప్రాణాలతో బయటపడ్డామని, ఒకవేళ తాము మరణించి ఉంటే తమ కుటుంబాల పరిస్థితి ఏంటని కొందరు... స్థానిక అధికారులను ప్రశ్నించారు. మరమ్మతులు త్వరగా చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని లేనిపక్షంలో తమ ఆగ్రహం చవిచూస్తారని గ్రామస్థులు హెచ్చరించారు.

# మోసపోతే గోస పడతాం

నల్లగొండ: మోసపోతే గోస పడుతాం అని చెప్పినం. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోవిచక్షణతో ఓటెయ్యాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నకిరేకల్‌లో గ్రాడ్యుయేట్ ఓటర్ల సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ అని చెప్పి పచ్చి మోసం చేశాడు. ధాన్యం బోనస్ విషయంలో కూడా మాట తప్పిండని విమర్శించారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ అంటూ అన్ని బోగస్ మాటలు మాట్లాడుతున్నాడని సీఎంపై మండిపడ్డారు. ఆరు గ్యారంటీలతో అభూతకల్పనలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇన్ని అబద్దాలు ఆడుతున్న కాంగ్రెస్‌కు ఓటుతో సరైన బుద్ధి చెప్పాలన్నారు. అలాగే విద్యుత్ కూడా సరిగా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఓట్లప్పుడు మాత్రమే రైతుబంధు ఇస్తుండు, మహిళలకు రూ.2,500 ఇస్తా అని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు కూడా నిర్లజ్జగా అబద్దాలు ఆడుతున్నారని ఘాటుగా విమర్శించారు. దేవుళ్ల మీద ఓట్లు వేస్తూ రేవంత్ రెడ్డి పూటకో అబద్ధం అడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా ఉద్యోగాలు ఇచ్చినం అని అబద్దాలు అడుతున్నాడు. 30 వేల ఉద్యోగాలు కేసీఆర్ రిక్రూట్మెంట్ చేస్తే వాటికి కాగితాలు పంచుతూ సీఎం అబద్దాలు అడుతున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి గొప్ప విద్యావంతుడు అతనికి ఓటేస్తే ప్రభుత్వంపై కొట్లాడుతాడని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి పచ్చి బ్లాక్ మెయిలర్. అతను అబద్దాలు ఆడే వ్యక్తి. 56 క్రిమినల్ కేసులు ఉన్నాయని గుర్తు చేశారు. అమ్మాయిలు పెట్టిన కేసులే పది దాకా ఉన్నాయి. అతను చేసేవి అన్నీ లంగ పనులేనని ఘాటు విమర్శించారు. అతన్ని చట్టసభల్లోకి రానివ్వకుండా బుద్ధి చెప్పాలన్నారు. జీవో 46 ని రద్దు చేసేందుకు మా ప్రభుత్వంలో అన్నీ సిద్ధం చేసినం. దురదృష్టవశాత్తు అప్పటికే ఎన్నికల కోడ్ వచ్చింది. ప్రాసెస్ అంతా నిలిచిపోయింది. ఇప్పుడు ఆ జీవోను రద్దు చేసేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# అదానీ కంపెనీ బడా మోసం!..




న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ బొగ్గు విషయంలో అనేక అవకతవకలకు పాల్పడుతున్నట్టు చాలా కాలంగా ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక సంచలన విషయాలు బయటపెట్టింది. ఖరీదైన, స్వచ్ఛమైన బొగ్గు పేరిట నాసిరకం బొగ్గును సరఫరా చేస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నదని, అదే క్రమంలో రెట్టింపు లాభాలు జేబులో వేసుకుంటున్నదని వెల్లడించింది. ఈ మేరకు ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్పీ) సంపాదించిన పత్రాల ఆధారంగా పెన సంచలనాత్మక కథనాన్ని ఆ పత్రిక ప్రచురించింది. ఖరీదైన బొగ్గు పేరుతో పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తున్న అదానీ కంపెనీ గుట్టును రట్టు చేసింది. అదానీ పెద్ద ఎత్తున లాభాలు సంపాదిస్తున్న దాని వెనుక ఉన్న రహస్యాన్ని బయటపెట్టింది.

సింగపూర్‌లో 3వేల కేలరీలు.. తమిళనాడుకు వచ్చేసరికి ఆరువేలు!

ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక పేర్కొన్నదాని ప్రకారం.. 2014 జనవరిలో అదానీ గ్రూపు ఇండోనేసియా నుంచి బొగ్గు షిప్‌మెంట్‌ను కొనుగోలు చేసినట్టు ఇన్‌వాయిస్ చూపుతున్నది. అందులో కిలోకు 3500 కేలరీలు ఉన్నట్టు పేర్కొంది. అదే షిప్‌మెంట్‌ను తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (%ఋఅస్త్రవసఎశీ%)కు కిలోకు ఆరు వేల కేలరీలు ఉన్నట్టు చెబుతూ విక్రయించారు. ఆరువేల కేలరీల బొగ్గు అంటే అత్యంత పరిశుభ్రమైన, స్వచ్ఛమైన బొగ్గు అని అర్థం. ఈ ప్రక్రియలో రవాణా ఖర్చులు మినహాయిస్తే అదానీ రెట్టింపు లాభం పొందినట్టయిందని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక పేర్కొన్నది.ఇదే పార్టీల మధ్య జరిగిన జరిగిన 22 షిప్‌మెంట్‌ల పత్రాలను పరిశీలించగా.. మొత్తం 1.5 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరాచేసినట్టు తేలింది. అంటే.. తక్కువ నాణ్యత కలిగిన బొగ్గును చౌక ధరలకు కొనుగోలు చేసి, అదే బొగ్గును తమిళనాడుకు రెట్టిపు ధరలకు అమ్మేశారు. 2013 డిసెంబర్‌లో ఇండోనేషియా నుంచి టన్ను 28 డాలర్ల విలువతో బయల్దేరిన షిప్‌మెంట్.. ఇండియాకు చేరుకుని, అదానీ కంపెనీ దానిని తమిళనాడుకు అమ్మేసరికి అది కాస్తా టన్ను 92 డాలర్లు అయిపోయిందని ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్పీ) సంపాదించిన పత్రాలను ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక ఉటంకించింది.

ప్రాణాలు తీస్తున్న గాలి కాలుష్యం

గాలి కాలుష్యంతో కలిగే అనారోగ్యాలతో భారతదేశంలో ఏటా 20 లక్షల మంది చనిపోతున్నారని 2022లో లాన్సెట్ అధ్యయనం ఒకటి వెల్లడించింది. బొగ్గు ఆధారిత విద్యుత్తు ప్లాంట్లకు వందల కిలోమీటర్ల పరిధిలో శిశు మరణాలు అత్యధికంగా ఉంటున్నాయని పలు ఇతర అధ్యయనాలు కూడా పేర్కొంటున్నాయి. దేశ విద్యుత్తు అవసరాల్లో 30 శాతాన్ని బొగ్గు ఆధారిత విద్యుత్తు ప్లాంట్లు తీర్చుతున్నాయి. దశాబ్దం క్రితం నిర్వహించిన ఒక అధ్యయనం బొగ్గు కాల్చి విద్యుత్తును ఉత్పత్తి చేసేప్లాంట్ల నుంచి 15 శాతం ఉద్గారాలు, 30శాతం నైట్రోజెన్ ఆక్సైడ్, 50 శాతం సల్ఫర్ డయాక్సైడ్ విడుదలవుతాయని దశాబ్దం క్రితం ఒక అధ్యయనం వెల్లడించింది.అదానీ బొగ్గు కుంభకోణాలపై గతంలో కూడా ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక కథనాలు ప్రచురించింది. వాటి ఆధారంగా అదానీపై దర్యాప్తు జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మార్కెట్ ధరలకు మించి భారత్‌కు బొగ్గు సరఫరా చేసేందుకు మధ్య దళారీలకు అదానీ గ్రూపు దాదాపు 5 బిలియన్ డాలర్లు చెల్లించిందని ఆ కథనాల్లో పత్రిక పేర్కొన్నది.

ఎన్నికల వేళ కలకలం

ఇప్పటికే దేశాన్ని అదానీ, అంబానీలకు బీజేపీ ప్రభుత్వం దోచిపెట్టిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రధాని మోదీకి అదానీ సన్నిహితుడనే ప్రచారం కూడా ఉన్నది. ప్రస్తుతం ఎన్నికల వేళ సైతం ఆ ఆరోపణలను కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు బలంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నాయి. ఈ సమయంలో ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక సంచలన విషయాలు బయటపెట్టడం బీజేపీకి తీవ్ర ఇబ్బందికర అంశమేనని పరిశీలకులు అంటున్నారు. అయితే.. అదానీ గ్రూప మాత్రం ఈ ఆరోపణలను కొట్టిపారేసింది. బొగ్గు నాణ్యతను లోడింగ్, అన్‌లోడింగ్ పాయింట్ల వద్ద కస్టమ్స్ అధికారులు, తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ శాస్త్రవేత్తలు తనిఖీ చేస్తారని తెలిపారు. ఇటువంటి ఆరోపణలు అహేతుకమని, ఆధార రహితమని కొట్టిపారేశారు.

అధికారంలోకి వస్తే అదానీ కుంభకోణాలపై జేపీసీ

ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే అదానీ బొగ్గు కుంభకోణంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు చేయిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. 'బీజేపీ పాలనలో భారీ బొగ్గు కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫేవరెట్ స్నేహితుడు అదానీ నాసిరకం బొగ్గును మూడింతల ధరకు అమ్మడం ద్వారా వేల కోట్లు లూటీ చేశారు' అని రాహుల్ గాంధీ ఆరోపించారు. అదానీ దోచున్న సొమ్ము.. దేశ సాధారణ ప్రజలదని అన్నారు.

మోదీపై మహువా మొయిత్రా సెటైర్లు

అధిక ధరలకు నాసిరకం బొగ్గును సరఫరా చేసినట్టు వచ్చిన వార్తలపై స్పందించిన తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా.. మోదీపై సెటైర్లు వేశారు. 'నా చీరలు లెక్కించడం, నా స్నేహితులకు ఫోన్ చేయడం పూర్తయితే.. అదానీ అంశాన్ని దర్యాప్తు చేయమని సీబీఐకి, ఈడీకి చెప్పండి..' అని ఆమె ఎక్స్‌లో మోదీని ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు.

## మదీనాగూడకు పోటెత్తిన భక్తులు

హైదరాబాద్,నగర శివారులోని శేరిలింగంపల్లిలో అద్భుతం చోటు చేసుకుంది. భక్తులు ప్రసాదంగా సమర్పించిన పాలను అమ్మవారు తాగుతున్నారన్న ప్రచారంతో భక్తులు పోటెత్తారు. అదరుదైన, అద్భుతమైన ఘట్టాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అమ్మావారి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగిపోతుంది.

# అమీతుమీకి సిద్ధం కావాలి


విశాఖపట్టణం,దేశంలో ఎన్నికల ముగింపు వేళ కొత్తగా వచ్చే ప్రభుత్వం విశాఖ ఉక్కుతో పాటు, ఉక్కు పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలి. పరిశ్రమల ఏర్పాటుతోనే ఉపాధి, ఉద్యోగాలు దక్కుతాయి. అలాగే విశ్వాఖ ఉక్కును కాపాడుకునే ప్రయత్నాలు కొనసాగించాలి. ఈ విషయంలో కేంద్రంతో అమీతుమీకి కూడా సిద్ధపడాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశంలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం ముఖ్యం. అలాగే ఈ విషయంలో కొంత నష్టం లేదా కష్టం కలిగిన యువతకు ఉపాధి లక్ష్యంగా ముందుకు సాగాలి. అంతేగానీ వీటి ఏర్పాటు సాధ్యం కాదనుకుంటే దేశంలో లక్షలాదిగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కదు. సంకుచిత స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు విరుద్దంగా అభివృద్ధి సాగాలి. అప్పుడే ఉక్కు పరిశ్రమల ఏర్పాటు సాకారం కాగలదు. అలాగే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి. అక్కడ మరిన్ని ఉద్యోగాల కల్పన చేసి, ఉక్కు గనులను కేటాయించాలి. ఎందరో త్యాగ ఫలితంగా ఏర్పడ్డ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మడా దారుణం కాక మరోటికాదు. కడప, బయ్యారం ఉక్కు కర్మాగారాల ఏర్పాటు సాధ్యం కాదని ప్రకటించిన కేంద్రం తీరు నిరుద్యోగులను వంచించేలా ఉంది. అలాగే స్థానికంగా లభ్యమవుతున్న ముడిసరుకుని విదేశాలకు తరలిస్తున్న తీరును అడ్డుకునేలా లేదు. కడప, బయ్యారం ఉక్కు కర్మాగారాల ఏర్పాటు సాధ్యం కాదంటూ సెయిల్ 2014 డిసెంబర్‌లో ఇచ్చిన నివేదికను 2018 జూన్ 13న సుప్రీం కోర్టుకు అఫిడవిట్ దాఖలు చేయడంలోనే కేందప్రభుత్వ దగా స్పష్టమవుతోంది. ఈ అంశంపై ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్ఐఎన్ఎల్, ఎంఎంటిసి, మెకాన్ సంస్థల ప్రతినిధులతో ఒక టాస్క్‌ఫోర్స్‌ను 2016 అక్టోబర్‌లో నియమించారు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో అపారమైన ఇనుప ఖనిజ నిల్వలున్నాయనీ, అనంతపురం గనుల ఖనిజం నాణ్యత ఎక్కువనీ మెకాన్ సంస్థ నిర్ధారించింది. కడప ఉక్కు కర్మాగారానికి ఆ ఖనిజ నిక్షేపాలను కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతనూ తెలిపింది. వీటన్నిటి ఆధారంగా కడప ఉక్కు కర్మాగార ఏర్పాటు సాధ్యమేనని మెకాన్ సంస్థ సమర్పించిన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. అయినా సుప్రీంకు సమర్పించిన అఫిడవిట్‌లో 2017 డిసెంబర్‌నాటి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం గురించి మాత్రమే పేర్కొనడం వాస్తవాన్ని కప్పిపుచ్చడానికే అన్నది గమనించాలి. ఇలాంటి విషయాల్లో నాలుగేళ్లుగా కాలయాపన చేసి చివరి సంవత్సరం చేతులెత్తేయడం ద్వారా బృహత్తర లక్ష్యాన్ని దెబ్బతీయడం కాకా మరోటి కాదు. ఇలా చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉన్న అవకాశాలను దెబ్బతీయడం తప్ప మరోటి కాదు. సామాన్య ప్రజలనేగాక న్యాయ వ్యవస్థనూ మోడీ సర్కారు పక్కదారి పట్టించందనే అనుకోవాలి. కడప ఉక్కు విషయంలో మోసాన్ని రాష్ట్ర ప్రజలు ముక్త కంఠంతో నిరసించగానే కేంద ప్రభుత్వం కొత్త నాటకానికి తెర లేపడమే. కడప ఉక్కుపట్ల కేంద్రం ఎంత ప్రతికూలంగా వుందో స్పష్టమవుతోంది. రైల్వే జోన్ ఏర్పాటుపైనా ఎన్డిఎ ప్రభుత్వం దోబూచులాడుతూనేవుంది. గిరిజన విశ్వవిద్యాలయ స్థాపనకు చేపట్టవలసిన చట్ట సవరణను ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేసింది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక నిధులు మూడేళ్లు మాత్రమే ఇచ్చి, తర్వాత నిలిపివేసింది. పోర్టు ఏర్పాటుకూ తిలోదకాలిచ్చింది. ఇలా అనేక అంశాల్లో తెలుగు ప్రజలపట్ల మోడీ సర్కారు ద్వేషపూరితంగా వ్యవహరించి, విభ.న హామీలను తుంగలో తొక్కింది.

# నిరుద్యోగ భారతంలో మరో అంకం




న్యూఢిల్లీ, దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నా..అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోలేక పోతున్నా బిజెపిలో అంతర్మథనం జరగడం లేదు. ఎందుకిలా అవుతుందో అన్న ఆలోచన చేయడం లేదు. పట్టాలు పట్టుకుని రోడ్డెక్కుతున్న నిరుద్యోగల సంఖ్య ఏటా కోట్లకు చేరుతోంది. తాజా గణాంకాలే ఇందుకు నిదర్శనం. ఘతన వహించిన ప్రధాని మోడీ నిరుద్యోగం గురించి మాట్లాడడం లేదు. ఐఐటిల్లో చదివి పట్టాలు పుచ్చుకున్న వారికే ఉద్యోగాలకు దిక్కులేకుండా పోయింది. ఇక మిగతా కాలేజీల్లో చదివిన వారి సంగతి ఎలా ఉంటుందో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. దేశంలో విద్యా సంస్థల్లో ఐఐటిలకు ప్రత్యేక స్థానం ఉంది. ఐఐటిల్లో చదివిన వారికి మంచి ఉద్యోగాలు, లక్షల్లో వేతనాలు ఉంటాయని వింటుంటాం. కానీ, ప్రస్తుతం అందుకు భిన్నమైన పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. దేశంలోని వివిధ ఐఐటిల్లో విద్యనభ్యసిం చిన విద్యార్థుల్లో ఈ ఏడాది దాదాపు 38 శాతం మందికి క్యాంపస్ ఉద్యోగాలు దక్కలేదు. దేశంలో 61 శాతం పోస్ట్ గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాలు దక్కలేదు. ఐఐటి కాన్పూర్ పూర్వ విద్యార్థి ధీరజ్సింగ్ సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా సేకరించిన సమాచారంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. ఈ ఏడాది మొత్తం 23 ఐఐటి క్యాంపస్ ల్లో దాదాపు 8 వేల మంది అంటే 38శాతం మందికి ఐఐటి విద్యార్థులకు ఉద్యోగాలు దక్కలేదని తేలింది. 2024లో 21,500 మంది విద్యార్థులు ఉద్యోగాలు కోసం నమోదు చేసుకోగా, కేవలం 13,400 మంది మాత్రమే ఉద్యోగాలు సాధించారు. మిగతా వారు 38 శాతం ఇంకా కొలువుల కోసం అన్వేషిస్తున్నట్లు వెల్లడైంది. రెండేళ్ల క్రితం నాటితో పోలిస్తే ఈ పరిస్థితి దాదాపు రెట్టింపు అయినట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. పాత తొమ్మిది ఐఐటిల్లో ఈ ఏడాది 16,400 మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం నమోదు చేసుకోగా, వారిలో 6,050 మందికి అంటే 37 శాతం మందికి ఇంకా ఉద్యోగాలు దక్కలేదు. కొత్త 14 ఐఐటిల్లో అయితే ఈ పరిస్థితి మరింత క్షీణించింది. 5,100 మంది ఉద్యోగాలు కోసం నమోదు చేసుకోగా, ఇంకా 2,040 మందికి కొలువులు రాలేదని తేలింది. గతేడాది ఖరగ్‌పూర్ ఐఐటిల్లో 33 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కలేదని ధీరజ్ సింగ్ పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో సంక్షోభ పరిస్థితుల కారణంగా ఇంకా ఉద్యోగాలు రాని విద్యార్థులు ఒత్తిడి, ఆందోళన, నిస్సహాయతతో ఉన్నారని ఆయన తెలిపారు. ఉద్యోగాలురాని విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావడం దేశంలోని అత్యుత్తమ ఇంజినీరింగ్ కళాశాలల్లో అనిశ్చిత స్థితిని సూచిస్తుంది. దాదాపు 61 శాతం పోస్ట్‌గ్రాడ్యుయేట్‌లు ఇప్పటికీ చోటు చేసుకోలేదు. ఇది ప్రధాన కళాశాలలు, యువ గ్రాడ్యుయేట్లు ఎదుర్కొంటున్న ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ సంక్షోభం నెలకొందని ధీరజ్ సింగ్ తెలిపారు. ఐటి ఢిల్లీలో గత ఐదేళ్లలో 22 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కకపోగా, 2024కు వచ్చేసరికి 40 శాతం మందికి అదే పరిస్థితి ఎదురైంది. గత రెండేళ్లలో 600 మందికి ఉద్యోగాలు దక్కలేదు. 2022 నుంచి 2024 వరకు పాత తొమ్మిది ఐఐటిల్లో నమోదు చేసుకున్న విద్యార్థుల సంఖ్య 1.2 రెట్లు పెరగ్గా, ఉద్యోగాలు సాధించనివారి సంఖ్య 2.1 రెట్లు పెరిగింది. అలాగే, నూతన ఐఐటిల్లో నమోదిత విద్యార్థుల సంఖ్య 1.3 రెట్లు పెరిగింది. కానీ ఉద్యోగాలు దక్కని విద్యార్థుల సంఖ్య కూడా 3.8 రెట్లు పెరిగింది. ఈ సంక్షోభం విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది ఆరుగురు ఐఐటి విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా, అనేక మంది తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇది పాలకుల నిర్లక్ష్యం, దూరదృష్టి లోపంగా చూడాలి. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వడంలో మనం ఎందుకు విఫలం అవుతున్నామో అధ్యయనం చేయాలి. అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలి.

# గుంతలు.. బీటలు.. ఓ మేడిగడ్డ ప్రాజెక్ట్




హైదరాబాద్,మేడిగడ్డ ఓ మేడిపండు.. యస్.. ఇది ఏదో రైమింగ్ కోసం వాడుతున్న పదాలు కాదు. మేడిగడ్డ ఓ డొల్ల అనేది ఎప్పటి నుంచో కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణ. ఇప్పుడివి ఆరోపణలు కాదు.. నగ్న సత్యాలని తేలింది. గతంలో మొరాయించిన గేట్లు ఎత్తేందుకు ప్రయత్నిస్తుంటే వచ్చే శబ్ధాలు విని ఇంజనీర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బ్యారేజ్ ఇంకేంత కుంగుతుందో అనే భయం పనులను ముందుకు సాగనివ్వడం లేదు.నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎక్స్‌పర్ట్ కమిటీ ఒక సూచన చేసింది. వర్షాకాలం రాకముందే మేడిగడ్డలో మొరాయించిన గేట్లన్నీ పైకి ఎత్తాలని చెప్పింది. లేదంటే మొత్తం బ్యారేజీకే అసలుకే మోసమని వార్నింగ్ ఇచ్చింది. అయితే ఇలా గేట్లు ఎత్తాలని ఎందుకు నిర్ణయించారో ఒకసారి గుర్తు చేసుకుందాం.. గతేడాది అక్టోబర్ 21న 7వ నంబర్ బ్లాక్ కుంగింది. ఈ బ్లాక్‌లోని రెండు పియర్స్‌కు పగుళ్లు ఏర్పాడ్డాయి..దీంతో 19, 20, 21 పియర్ల మధ్య ఉన్న గేట్లను ఎత్తలేకపోయారు. కుంగిన సమయంలో నీటి లీకేజీని ఆపేందుకు ఏకంగా 40 వేల ఇసుక బస్తాలను వేశారు. అయితే ఈ గేట్లను ఎత్తడం అంత ఈజీ కాదు. ఎందుకంటే పునాదులు ఇప్పటికే కుంగాయి.టన్నుల బరువున్న ఈ గేట్లను ఇప్పుడు కదిలిస్తే బ్యారేజీ మరింత కుంగే ప్రమాదం.. సో పునాదులపై ఎలాంటి ప్రెజర్ పడకుండా.. క్రేన్లను ఏర్పాటు చేసి గేట్లను ఎత్తాలన్న దీనికి అనుగుణంగా 15వ నెంబర్‌ను సక్సెస్‌ఫుల్‌గా లిఫ్ట్ చేశారు. బట్ ఎప్పుడైతే 16వ నెంబర్ గేట్‌ను ఎత్తేందుకు ప్రయత్నించారో.. అప్పుడు శబ్ధాలు, ప్రకంపనలు మొదలయ్యాయి. ఏంటా అని చూస్తే.. అసలు కింద మొత్తం అగాథమే ఉందని తేలింది.గుంతలు.. ఇప్పుడు మేడిగడ్డలో ఎక్కడ చూసిన కనిపిస్తున్నవి ఇవే.. వీటిని చూశాక గేట్ల పనుల విషయంలో అడుగు ముందుకు పడటం లేదు. నిజానికి మేడిగడ్డ బ్యారేజీలో గతంలో భారీ ఎత్తున నీటిని నిల్వ చేశారు. ఆ ఒత్తిడితో బ్యారేజీ కింద నుంచి ఇసుక పెద్ద మొత్తంలో కొట్టుకుపోయింది. దీంతో అడుగున పెద్ద అగాథం ఏర్పడిందని %చీణూూ% అంచనాకు వచ్చింది. దీని సైజ్ ఏకంగా 12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల వరకు ఉండొచ్చనేది ఓ అంచనా.. అయితే ఈ అగాథం ఒకే చోట లేదు.. బ్యారేజీ పొడవులన కొన్ని చోట్ల చిన్నగా.. మరికొన్ని చోట్ల పెద్దగా ఉన్నాయి. ఈ అగాథం కారణంగానే ఏడో బ్లాక్‌లో ప్రస్తుతం పియర్లు కుంగిపోయాయి. ఇప్పుడు రిపేర్లకు కూడా ఈ అగాథలే అడ్డుగా మారాయి.గేట్లను ఎత్తేందుకు ప్రయత్నిస్తే.. ర్యాఫ్టలు డ్యామేజ్ అవుతున్నాయి. మరిప్పుడు ఏం చేయాలి? పనులు ముందుకు సాగాలంటే ఏం చేయాలి? ప్రస్తుతం ర్యాఫ్ట్ కింద భారీ గుంతలను గ్రౌటింగ్ చేస్తున్నారు. కాంక్రీట్ గ్రౌటింగ్ కోసం రెండు మిషిన్లను తీసుకొచ్చి పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తి కావాలంటే వారం టైమ్ పడుతుంది. ఈ పనులు సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ అయితేనే గేట్లు ఎత్తే అవకాశం ఉంది. ఏదీ ఏమైనా వర్షాకాలంలోపు మొత్తం గేట్లు ఎత్తాలి. లేదంటే అప్పుడు వచ్చే వరద కారణంగా మొత్తం బ్యారేజీనే దెబ్బతినే అవకాశం ఉంది. మరి గ్రౌటింగ్ పనులు ఫెయిల్ అయితే.. ఈ డౌట్ వచ్చిన ఇంజనీర్స్ ప్లాన్ బీని రెడీ చేశారు. అవసరమైతే మొత్తం గేట్‌నే తొలగించేందుకు రెడీ అవుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైందిఅసలు మేడిగడ్డ బ్యారేజీ కింది భాగంలో బొరియలు ఎగ్జాక్టగా ఎక్కడున్నాయి.. ? దీని కోసం ఎక్స్‌పర్ట్ కమిటీ మూడు సంస్థలను సూచించింది. ఆ సంస్థలతో అన్ని పరీక్షలు చేయించనున్నారు. ఆ సంస్థల రిపోర్ట్ ఆధారంగా ఇసుక, సిమెంటు మిశ్రమాన్ని ఆ ఆగాథాల్లో నింపి.. వాటిని పూడ్చివేయనున్నారు. ఇలా ప్రెషర్ గ్రౌటింగ్ చేసిన తర్వాత గేట్లు ఎత్తే పనులు ప్రారంభం కానున్నాయి.అసలు ప్రాజెక్టులో ఈ అగాథాలు ఎందుకు ఏర్పడ్డాయి? దీనికి ఆన్సర్ గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమే అని తెలుస్తుంది. మేడిగడ్డ ప్రాజెక్ట్ 2019లో పూర్తైంది. ఆ ఇయర్‌లో వచ్చిన వరదలకే బ్యారేజ్ దెబ్బతిన్నది. కానీ ఈ విషయాన్ని అప్పటి ఇంజనీర్లు గుర్తించి ప్రభుత్వానికి చెప్పినా.. కేసీఆర్ సర్కార్ పట్టించుకోలేదు.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పటి నుంచి ప్రతి ఇయర్.. కొంచెం కొంచెంగా బ్యారేజ్ డ్యామేజ్ అవుతూ వస్తుంది.. చివరికి కుంగిపోయింది. ఇప్పటికీ ఈ డేంజర్ బెల్స్ మోగుతూనే ఉన్నాయి. వచ్చే వర్షకాలంలో ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఏంటన్నది ఇంజనీర్ల భయం.అసలు మేడిగడ్డ ప్రాజెక్ట్ భవితవ్యం ఏంటి? భవిష్యత్తులో మళ్లీ అది బ్యారేజ్‌గా పనిచేస్తుందా? లేదా? సమాధానాలు రావాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.. అయితే ఒకటి మాత్రం నిజం.. నెక్ట్స్ సీజన్‌కి కూడా బ్యారేజ్‌తో ఎలాంటి ఉపయోగం లేదు.

# ఆన్‌లైన్‌లో యాదాద్రి సేవలు



యాదాద్రి,తెలంగాణలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం తర్వాత ఇలా వైకుంఠంగా పేరుందిన తిరుమల తరహాలో యాదాద్రిలో ఆలయనిర్మాణం, మాఢవీధులు, స్వామివారి పూజ కైంకర్యాలు, ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాలు, ప్రసాదాలతో తెలంగాణ తిరుమలగా రూపుదిద్దుకుంది.తిరుమల తరహాలో యాదాద్రి సేవలను, దర్శనాలను ఆన్‌లైన్ చేయాలని యోచిస్తున్నారు. ఇది యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించే భక్తులకు శుభవార్తగా చెప్పుకోవాలి రోజు రోజుకు లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆలయ పునర్నిర్మాణం తరవాత గణనీయంగా యాత్రికుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. పెద్ద సంఖ్యలో ఆలయానికి భక్తులు వస్తున్నారు. ఈ నేపథ్యంలో యాదాద్రీశుడి దర్శనం కోరి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతి తిరుమల దేవస్థానం తరహాలోనే యాదాద్రి ఆలయంలో కూడా టికెట్లును ఆన్‌లైన్‌లో పొందే విధంగా ఏర్పాటు చేసింది ఈ పుణ్యక్షేత్రానికి భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మరోవైపు వీఐపీ, వీవీఐపీ, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తుల సిఫార్సులపై వచ్చే భక్తులకు 300 రూపాయల టికెట్‌తో బ్రేక్ దర్శనం కల్పిస్తున్నారు. రూ.150 చెల్లించి శీఘ్రదర్శనం ఆన్ లైన్ లో నమోదుకు అవకాశం ఉండగా, ప్రస్తుతం అన్ని సేవలను ఆన్ లైన్ అందుబాటులోకి దేవస్థానం తీసుకువచ్చింది. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ను సందర్శించి టికెట్స్ బుక్ చేసుకోవచ్చు. ఇక ఇదే వెబ్ సైట్ నుంచి ఈ హుండీ ద్వారా డొనేషన్స్ కూడా ఇవ్వవచ్చు. ఆన్ లైన్ బుకింగ్ ద్వారా గంట ముందు దర్శన, పూజ కైంకర్యాలకు బుకింగ్ చేసుకునే అవకాశం యాదగిరిగుట్ట దేవస్థానం కల్పించింది. ఆన్ లైన్ బుకింగ్ లో పేరు, గోత్రం, పూజ వివరాలు, ఫోన్ నంబర్, మెయిల్ ఐడీ, తేదీ, ఎన్ని టికెట్లు, అడ్రస్, ఆధార్ నెంబర్, ఆలయ సందర్శన వేళ వంటి వివరాలు నింపాలి. ఆన్ లైన్ బుకింగ్, కౌంటర్ లో కంప్యూటరైజ్డ్ టికెట్లు పొందిన భక్తులకు తూర్పు రాజగోపురం వద్ద టికెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆలయంలో లోనికి అనుమతిస్తారన్నారని ఆలయ ఈవో భాస్కరరావు తెలిపారు. ఇది మంచి ఆలోచన అని భక్తులు కూడా ఆహ్వానిస్తున్నారు.

# పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన వైసిపి



తిరుపతి,వైసీపీ ప్రభుత్వంలో పోలీస్ వ్యవస్థ నిర్వీర్యమైందని, ప్రశాంతమైన ఉమ్మడి చిత్తూరు జిల్లా లో స్ట్రాంగ్ రూమ్ వద్ద కాండిడేట్‌పై హత్యయత్నం జరగడంపై పోలీసులు సిగ్గుతో తలదించుకోవాల్సిన సంఘటన అని సీపీఐ నేత రామకృష్ణ అన్నారు. శుక్రవారం తిరుపతిలోఆయన మీడియాతో మాట్లాడుతూ సిగ్గులేకుండా ఖాకీ డ్రెస్ వేసుకుని అమ్ముడు పోయారని దుయ్యబట్టారు. సకల పాపాల భైరవుడు డీజీపీ ,పోలీసులు ఒకవైపు పూర్తిగా మోకరిల్లటం వల్ల ఈ పరిస్థితి నెలకొందన్నారు. హోమ్ మినిస్టర్ ఎవరో కూడా కనీసం తెలియదని, కానిస్టేబుల్ కూడా లెక్క చేయని పరిస్థితి అని, ఈ ఖ్యాతి మొత్తం సీఎం జగన్ రెడ్డికే దక్కుతుందని ఆయన అన్నారు. రాబోయే ప్రభుత్వం కూడా పోలీసుల్ని అనవసరంగా వినియోగించవద్దని కోరుతున్నామని, వారి డ్యూటీని వారు చేయనియ్యాలని రామకృష్ణ సూచించారు. 175 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పదివేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారని, ప్రతి నియోజకవర్గంలో ఓటుకి రూ. 3వేలు, పోస్టల్ బ్యాలెట్‌కు రూ. 5వేల చొప్పన ఇచ్చారని ఆరోపించారు. ఈసీ ఏం చేస్తోంది? వారు కూడా అమ్ముడు పోయారా? అని ప్రశ్నించారు. ఈసీ కూడా డబ్బులు తీసుకుంది కాబట్టి ఎక్కడ డబ్బుల పంపిణీని నిరోధించలేదని విమర్శించారు. పిఠాపురంలో వైసీపీ అభ్యర్థి వంగా గీత ఇంటి వద్ద డబ్బులు ఇవ్వలేదని కొందరు ధర్నా చేశారని, 2029 లో డబ్బులు ఇవ్వలేదంటే జనం అభ్యర్థుల ఇంటికి వచ్చి కొడతారని, దీనిపై సుప్రీంకోర్టులో కేసు వేశానని రామకృష్ణ అన్నారు. వీటిపై పార్టీలకతీతంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. డబ్బులు పెట్టి ఓట్లు కొన్న తర్వాత ఓటర్లను ఎమ్మెల్యే ఎందుకు గౌరవించాలని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఖర్చు పెట్టడం కోసం ఎమ్మెల్యేలు అక్రమాలకు పాల్పడతారని, ఎర్రచందనం, గంజాయి, ఇసుక ఇలాంటివన్నీ అమ్ముతారని, ధనస్వామ్యం నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని రామకృష్ణ వ్యాఖ్యానించారు.

# ఎపిలో ప్రజాస్వామ్యం అపహాస్యం



అమరావతి,ఒక్క అవకాశం ఇవ్వాలని..ఒక్కసారి అధికారం ఇస్తే.. అంటూ చేసిన ప్రకటన వెనక ఉన్న కుట్రలు, కుతంత్రాలు ఎంత దారుణంగా ఉంటాయో ఎపిలో పరిస్థితులను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల్లో హింసను సృష్టించడం చూశాం. అధికారంలో ఉంటే ఎలా దాడులు చేయవచ్చు.. ఎలా దోచుకోవచ్చో చూశాం. అభివృద్ధి అన్నది లేకుండా రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన వైకాపా తీరుతో ఎపి నష్టపోవడం ఖాయం. ఇప్పటికే అభివృద్ధి వెనక్కి పోయింది. రాజధాని లేకుండా పోయింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేందుకు అవకాశం లేకుండా చేశారు. దీనిని బట్టి ఎన్నికలకు ముందు ఏ రాష్ట్రంలో అయినా అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని తొలగించి రాష్ట్రపతి పాలన విధించాలి. అధికార యంత్రాంగాన్ని కేంద్రం ఆధీనంలోకి తీసుకోవాలి. అధికారంలో ఉండడం వల్ల ఎన్ని అరచకాలు చేయవచ్చో వైకాపా నిరూపించింది. ఈ క్రమంలో కేంద్రం చట్టం తీసుకుని రావాలి. ఎన్నికలకు ముందు రాష్ట్రప్రభుత్వాలు మనుగడలో లేకుండా చేయాలి. అప్పుడే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయి. అధికారులు చెప్పినట్లు వింటారు. కానీ ఎపిలో అధికారులు , పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాయడం వల్ల ఎన్నికలు హింసాత్మకంగా మారాయి. ఎమ్మెల్యేనే పోలింగ్ బూత్‌లో చొరబడి ఈవీఎంను పగలగొట్టడం.. దానికి సంబంధించిన వీడియో బయటకు రావడం దారుణమైన ఘటనగా చెప్పుకోవాలి. దీనికి అధికార పక్షమైన వైకాపా సాధానం ఇచ్చుకోవాలి. ఆ ఎమమెల్యేపై చర్య తీసుకోవాలి. ఈ వ్యవహారాన్ని సమర్థించుకోవడం సరికాదు. పోలింగ్ జరిగిన రోజు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఈవీఎంను పగలగొట్టడమే కాకుండా బయటకు వచ్చి సాగించిన హింసాకాండకు సమాధానం ఇచ్చుకోవాలి. దీనికి సంబంధించిన వీడియో ఫుటేజీ ప్రజల్లోలోకి రావడంతో అసలు నిజ స్వరూపం తెలిసింది. ఆ తర్వాతనే ఈసీ ఆదేశాలతో ఆయనను పోలీసులు అరెస్టు చేయబోతే.. కనిపించ కుండా పోవడంపై అనుమానాలు మరింత బలపడ్డాయి. ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో ఆ పార్టీ ఇరకాటంలో పడిపోయిందనే చెప్పాలి. తమ ఎమ్మెల్యే వ్యవహారాన్ని సమర్థించుకునే ప్రయత్నాల్లో ఉక్కిరిబిక్కిరవుతోంది. చంద్రగిరిలో తెదేపా అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఆ ఘటన నుంచి ప్రజల దృష్టిని మరల్చే ఎత్తుగడతో ఆ నియోజకవర్గంలో కొన్ని బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని వైకాపా నేతలు కోరడం చర్చనీయాశంగా మారింది. ఈవీఎంను పిన్నెల్లి ధ్వంసం చేస్తున్న దృశ్యాలు వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంటే..దాన్ని కప్పిపుచ్చుకునేందుకు రకరకాల వాదనలను తెరపైకి తెస్తోంది. వీడియోలో ఉన్న విషయాన్ని చర్చ నుంచి పక్కకు నెట్టేందుకు అసలు ఆ వీడియో ఎక్కడి నుంచి బయటకు వచ్చిందంటూ ఆ పార్టీ నాయకులు కొత్త పల్లవిని ఎత్తుకున్నారు. ఒక ఎమ్మెల్యే ఈవీఎంను ధ్వంసం చేయడం సరైందా కాదా అనే విషయంలోకి వెళ్లకుండా.. సంబంధం లేని వాదనలతో అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. పిన్నెల్లి వెళ్లిన బూత్‌లోనే కాదు, ఇతర ప్రాంతాల్లోనూ ఈవీఎంలు ధ్వంసమయ్యాయని, వాటికి సంబంధించిన వీడియోలు బయటకు ఎందుకు రావడం లేదంటూ వైకాపా నాయకులు అడ్డంగా వాదిస్తున్నారు.మాచర్ల, సత్తెనపల్లి,గురజాల, నరసరావుపేట, పొన్నూరు, చంద్రగిరి, బాపట్ల, మార్కాపురం, కుప్పం, గంగాధర నెల్లూరు, టెక్కలి, అమలాపురం, ఉరవకొండ, వేమూరు, రాయచోటి, జగ్గయ్యపేట తదితర నియోజకవర్గాల్లోని వివిధ పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహిం చాలంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసి వైకాపా నేతలు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ నియోజకవర్గాల్లో తెదేపా కార్యకర్తలు రిగ్గింగు, బూత్ క్యాప్చరింగులకు పాల్పడ్డారంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము ఆరోపిస్తున్న బూత్‌లకు సంబంధించిన వీడియోలనూ బయట పెట్టాలంటూ పిన్నెల్లి వ్యవహారాన్ని పక్కదారిపట్టించే ప్రయత్నం చేసారు. అయితే ఇదంతా ఎన్నికల కౌంటింగ్ వరకు జరగవచ్చు. ఫలితాల్లో అనుకూలంగా ఉంటే ఫర్వాలేదు. లేకుంటే మరెంత హింసకు పాల్పడుతారన్నది గుర్తించి మసలుకోవాలి.

# కేంద్ర సాయుధ బలగాల ఏకీకృతం



న్యూఢిల్లీ : ఇప్పటికే అగ్నివీర్ సంస్థ తీసుకొచ్చి ఆర్మీలో అనిశ్చితిని, యువ సైనికుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసిన బిజెపి ప్రభుత్వం ఇప్పుడు కేంద్ర సాయుధ బలగాలను ఒకే గొడుకు కిందకు తీసుకువచ్చింది, పూర్తిగా తన చెప్పు చేతల్లో పెట్టుకునేందుకు పథక రచన చేస్తోంది. లోపల భాగంగానే కేంద్ర సాయుధ బలగాలు (ఎపిఎఫ్)ను విలీనం చేయడానికి జోరుగా పావులు కదుపుతోంది. జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఎ) అజిత్ దోవల్ శుక్రవారం సూచన ప్రాయంగా ఈ పరిశీలన నిర్వహించారు. జైంట్ థియేటర్ కమాండ్ ఆధారంగా సెంట్రల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్సెస్ (సిపిఎఫ్)ను విలీనం చేయాలనే ఆలోచన ఉంది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) ఇన్‌వెస్టిచర్ వేడుక, రుస్తుమ్ జీ స్మారక ఉపన్యాసంలో మాట్లాడుతూ అజిత్ దోవల్ ఈ పరిశీలన జరిగింది. సిపిఎఫ్‌లు లేదా పారామిలిటరీలో 'సమైక్యత' అవసరమని అన్నారు. ఇలాంటి చర్యతో డబ్బు ఆదా చేయడం మాత్రమే కాకుండా యుద్ధం లేదా శాంతి సమయాల్లో మొహరింపుల్లో ఏకీకృతను ఇది తీసుకుని వస్తుందని అన్నారు. ఎన్ఎస్ఎస్ఎ హెూదాలో ఈ పరిశీలన తాను చెప్పడం లేదని, ఒక పోలీసు అధికారిగానే ఈ సూచన ఇస్తున్నానని థోవల్‌ని పేర్కొన్నారు. 'సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్, సిపిఎఫ్‌ల్లో విలీనం గురించి మనం ఆలోచించాలి. మేం ఇప్పుడు ఎంతో శక్తివంతంగా ఉన్నాం. ప్రొక్యూర్మెంట్, కమ్యూనికేషన్, ట్రైనింగ్, ప్రామాణీకరణ వంటి అనేక విషయాల్లో మనం ఒకే రకమైన ఇంటర్–మింగ్ విధులను అందిస్తాం. అయితే వేరువేరుగా ఈ పనులన్నీ చేస్తున్నాం. జైంట్ థియేటర్ కమాండ్‌ను సైన్యంలో అమలు చేయడం చాలా కష్టం. ఎందుకంటే వాయుసేనకు చెందిన అధికారి ఆర్మీ, నౌకా దళానికి చెందిన బృందాలను కూడా నియంత్రించాలంటే చాలా కష్టం. ఎందుకంటే వారి పరికరాలు, వ్యూహాలు, ఆదేశాలు, నియంత్రణ వ్యవస్థలు వేరువేరుగా ఉంటాయి' అని థోవల్ అన్నారు. అయితే సిపిఎఫ్‌లో విధులు ఒకే విధంగా ఉంటాయని చెప్పారు. అలాగే, 'యుద్ధం లేదా శాంతి సమయాల్లో మన అవసరాలు ఎలా ఉన్నాయి. మనం 30 బెటాలియన్ల సిపిఎఫ్‌లను మొహరించాలి. సరిహదుల్లో ఒకవేళ బిఎస్ఎఫ్ లేకపోతే, సిఆర్‌పిఎఫ్‌లు కూడా ఈ విధులను నిర్వహించాలి. ఎందుకంటే వారు సుశిక్షితులు. వారి పరికారాలు, కమ్యూనికేషన్ వస్తువులు ఒక విధంగా ఉంటాయి. ఒక బృందంలో కొంతమంది సిఆర్‌పిఎఫ్, కొంతమంది బిఎస్ఎఫ్ సిబ్బంది ఉన్నా ఫరవాలేదు. వారు కలిసిపోగలరు' అని థోవల్ అన్నారు. అలాగే దేశంలో భారీ సంఘటన జరిగినప్పుడు మనం అంతర్గత భద్రత కోసం బిఎస్ఎఫ్ మొహరించడం గురించి ఆలోచించాలి' అని కూడా థోవల్ చెప్పారు. సిపిఎఫ్‌ను విలీనం చేయాలనే సూచనపై పలువురు మండిపడుతున్నారు. ఇది సైన్యంపై నిరంకుశత్వానికి దారి తీస్తుందని, సైన్యంలో నిష్పాక్షితను దూరం చేస్తుందని విమర్శిస్తున్నారు. కాగా, సుమారు పది లక్షల మంది సిబ్బంది ఉన్న సిపిఎఫ్‌ల్లో బిఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్, ఐటిబిపి, సిఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌బి, అస్సాం రైఫిల్స్ వంటి విభాగాలు ఉన్నాయి. బిఎప్ఎఫ్‌ను ఎక్కువగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల వెంబడి మోహరిస్తున్నా.. 2009 నుంచి వామపక్ష తీవ్రవాద ప్రభావ ప్రాంతాల్లోనూ మొహరిస్తుంది. సిఆర్‌పిఎఫ్‌ను అంతర్గత భద్రతా విధుల కోసం ఉపయోగిస్తున్నారు. ఈశాన్య, జమ్ముకాశ్మీర్ రాష్ట్రాల్లో ఎక్కువగా మోహరిస్తున్నారు. ఐటిబిపిను చైనా సరిహదుల వెంబడి మోహరిస్తున్నారు. సెంట్రల్ ఇండిస్టియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)కు పాత్ర ప్రభుత్వ ఇన్‌స్టాలేషన్‌లను రక్షించడం, విమానాశ్రయాలు, మెట్రో స్టేషన్లు వద్ద మోహరించడం వంటి విధులు కేటాయించారు. సశాస్త్ర సీమ బల్ (ఎస్ఎస్‌బి) నేపాల్, భూటాన్ సరిహద్దులను రక్షిస్తుంది. మయన్మార్‌తో సరిహద్దుల వెంబడి అస్సాం రైఫిల్స్ మోహరించి ఉంది. సిపిఎఫ్‌లో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్ఎఫ్), నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్‌సిజి) కూడా ఉన్నాయి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com